PRGI No. TEL TEL: 2012/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 148 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | మంగళవారం | సెప్టెంబర్ | 8 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00

### కల్తీ మద్యం తాగి.. బీజేపీ నేతతో సహా 12 మంది మృతి

భోపాల్: కల్తీ మద్యం తాగిన వారిలో బీజేపీ నేతతో సహా 12 మంది మరణించారు. మరో 54 మంది ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. కల్తీ మద్యం సేవించి మరణించిన వారి మృతదేహాలలో అధిక స్థాయిలో మిథనాల్ ఉన్నట్లు పోస్ట్‌మార్టం ని వేదికల ద్వారా వెల్లడైంది. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జిల్లాలోని బుందా–షాఫుర్ ప్రాంతంతో పాటు ఘూఘర్, నౌరాజ్, బరాజ్, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు శనివారం రాత్రి మద్యం సేవించారు.

ఆ తర్వాత వారు అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రికి తరలించగా చాలా మంది మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరికొందరిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. కాగా, కల్తీ మద్యం తాగిన వారిలో బీజేపీ మండల్ ప్రధాన కార్యదర్శి హర్నామ్ రాయ్‌తో సహా 12 మంది మరణించారు.

# ‘నా చీర లాగేశారు’

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు



**హైదరాబాద్,సెప్టెంబర్,07:**
తెలంగాణ అసెంబ్లీవర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తన చీర లాగేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. తన కాలికి కూడా గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తానని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు నల్ల షర్టులు, మహిళా నేతలు నల్లచీరలు ధరించి అసెంబ్లీకి వచ్చారు. అయితే వారికి ప్రవేశం లేదంటూ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.తన చీర లాగడం బాధ కలిగించిందని సునీతా లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్నమహిళలకే రక్షణ లేకపోతే బయట ఉన్న మహిళలకు వీళ్ల ఏంరక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. తన కాలికి గాయమైందని తెలిపారు. తాము అసెంబ్లీకి వస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామన్న భయంతోనే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# ఈజిప్టులో భారీ డ్రగ్స్ కేసు..

## 12 మందికి ఉరి, 9 మందికి జీవిత ఖైదు



- శిక్ష పడిన వారిలో ప్రముఖ టీవీ క్రైమ్ షో యాంకర్ సారా ఖలీఫా
- ముడి పదార్థాలతో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు పోలీసుల అభియోగాలు
- ఇదే కేసులో మరో 9 మందికి జీవిత ఖైదు, ఏడుగురి విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 7:**
ఈజిప్టులోసంచలనం సృష్టించినడ్రగ్స్ కేసులో కైరో కోర్టు కీలక తీర్పువెలువరించింది. ఓ ప్రముఖ టీవీ క్రైమ్ షో వ్యాఖ్యాత సహా మొత్తం 12మందికి మరణశిక్ష వి ధించింది. ఇదే కేసులోమరో తొమ్మిది మందికిజీవిత ఖైదు విధించగా,సరైన ఆధారాలు లేనికారణంగా ఏడుగు రిని నిర్దోషులుగా పరిగణిస్తూ విడుదల చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఓముఠా ముడిపదార్థాలను దిగుమతి చేసుకుని అక్రమంగామాదకద్రవ్యాలను తయారు చేస్తోందని పోలీసులకుసమాచారం అందింది.దీనిపైలోతుగా దర్యాప్తు చేపట్టినఅధికారులు, సదరు నిందితుల వద్దఅక్రమ ఆయుధాలు కూడా ఉన్నట్లు గుర్తించారు.




## స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయం

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

- స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు.. సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్‌ను కోరిన వైనం

**హైదరాబాద్,సెప్టెంబర్,7:**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్‌చేయాలని శాసనమ ండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడి న రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇదిస్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని,సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవ మానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆపార్టీనేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు.

# కంటతడి పెట్టిన స్పీకర్..



- అసెంబ్లీలో ఊహించని పరిణామం..
- అసెంబ్లీలో కంటతడి పెట్టిన స్పీకర్ ప్రసాద్
- తాతా మధు వ్యాఖ్యలపై సభలో తీవ్ర చర్చ
- తాతా మధును డిస్మిస్ చేయాలని సీఎం డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్,7:**
తెలంగాణ అసెంబ్లీలో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతామధు స్పీకర్‌ను ఉద్దేశించిఅనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు రాగా,దీనిపై సభలో చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఉదయం అసెంబ్లీవెలుపల తాతామధు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈవ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు సభలో తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌ను ఉద్దేశించి అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం చట్టసభలగౌరవాన్ని దెబ్బతీయడమేనని సీఎం అన్నా రు. తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభ్య సమాజానికి జరిగిన అవమానమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి భాషను చట్టసభల్లో సహించకూడదని స్పష్టం చేశారు. బీజేపీ శాసనసభాప క్ష నేతఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. స్పీకర్‌పై అనుచిత భాష ఉపయోగించిన సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## తెలంగాణ అసెంబ్లి గేటు వద్ద తోపులాట..

## కేటీఆర్ నుదుటికి, చేతికి గాయం!



**హైదరాబాద్,సెప్టెంబర్,07**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన ఉద్రిక్తతకు దారితీసింది. నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్ద అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ హామీల అమలును డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేస్తూ అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.బీఆర్ఎస్ నేతలు స్లోగన్లతో కూడిన నల్ల టీషర్టులు ధరించి రావడంతో.. స్పీకర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ లోపలికి అనుమతించలేమని పోలీసులు స్పష్టం చేశారు.టీషర్టులు తొలగించి సభలోకి వెళ్లాలని పోలీసులు కోరినప్పటికీ.. బీఆర్ఎస్ నేతలు నిరసన కొనసాగిస్తూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు.

ఈ క్రమంలో అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు నుదుటిపై, చేతికి గాయాలైయ్యాయి. మరోవైపు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కాలికి కూడాగాయం అయింది.తోపులాట అనంతరం పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసినవారిని అసెంబ్లీ గేటు వద్ద నుంచి తెలంగాణ భవన్‌కు తరలించారు.

# జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు

## మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారన్న సబిత..

- ఇది నాకో, సునీతమ్మకో జరిగిన అవమానం కాదు: సబితా ఇంద్రారెడ్డి
- కేటీఆర్ అడ్డుకోకపోయి ఉంటే అక్కడే పడేసి తొక్కేసే వారని ఆవేదన
- హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు



**హైదరాబాద్,సెప్టెంబర్,07:**
అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్ర... పోలీ సులు ప్రవర్తించిన తీరుపై ...రాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ...లోధ్వజమెత్తారు. ఇది కేవలం ...ం కాదని, మొత్తం తెలంగాణ మ...కి జరిగి నతీవ్ర అవమానమని నిప్పులుచెరిగారు. కాంగ్రెస్ 1, 000రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్లటీషర్టుల తో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమా నుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మె ల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూవిచక్షణారహితంగా ప్రవర్తించారనిఆరోపిం చారు."సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతు ంటే,కేటీఆర్‌సమయానికి వచ్చిఅడ్డుకోకపోయి ఉంటే మ మ్మల్నిఅక్కడే పడేసితొక్కేసేవారు.. కేటీఆర్‌రావడంతోనే మేముప్రాణాలతో బయటపడ్డాం" అనిసబితా ఇంద్రారెడ్డి తీవ్రఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై శాంతి యుతంగా నిరసనతెలుపుతుంటే గొంతునొక్కడం, బట్ట లులాగడం,దాడికి దిగడం ఏరకమైన ప్రజాపాలన అని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు.



# కాంగ్రెస్ పార్టీలో కలకలం..!

## మాజీ ఎమ్మెల్యే సహా 18 మందికి నోటీసులు

- తెలంగాణ కాంగ్రెస్‌లో 18 మంది నేతలకు షోకాజ్ నోటీసులు
- పార్టీ సమావేశాల్లో గొడవలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చర్యలు
- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలకు నోటీసులు
- వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశం



**హైదరాబాద్,సెప్టెంబర్,7:**
తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ ఉల్లంఘనలకు పాల్పడిన నేతలపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలకు సిద్ధమైంది. పార్టీ ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన 18 మంది నాయకులకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గాంధీ భవన్‌లో కమిటీ చైర్మన్ మల్లు రవి అధ్యక్షతనజరిగిన సమావేశంలో ఈమేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. నోటీసులు అందుకున్న నేతలు వారం రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని కమిటీ ఆదేశించింది. ఆదిలాబాద్, గజ్వేల్, సిరిసిల్ల, కరీంనగర్ నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీ అంతర్గత సమావేశాల్లో జరిగినవివాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలపై అందినఫిర్యాదులను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి ఈ చర్యలు చేపట్టింది. నోటీసులు అందుకున్న వారిలో గజ్వేల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,జూపల్లి మల్లారెడ్డి వంటి కీలక నేతలుఉన్నారు. వీరితో పాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కంది శ్రీనివాస్ రెడ్డి,సంజీవరెడ్డిల కుకూడా నోటీసులు జారీఅయ్యాయి. పెద్దపల్లిఎంపీ వంశీ కారుపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఆరుగురిపై,సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సింగితం శ్రీనివాస్ అందజేసిన ఫిర్యాదు మేరకు మరో ఏడుగురిపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. మూల లక్ష్మికి కూడా నో టీసుజారీచేశారు. ఈసందర్భంగా మల్లు రవిమాట్లా డుతూ.. పార్టీ నియమావళిని తాను ఎన్నడూ ఉల్లం ఘించలేదని, ఎవరిపైనా కక్ష సాధింపు ధోరణితో నివేదికలు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో ‘థర్డ్ క్లాస్’ పాలన

- లక్ష మందితో కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శిస్తామని ప్రకటన
- సమావేశానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి హాజరు
- వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా ప్రజా సమస్యలే అజెండాగా పోరాడాలని సూచన



**హైదరాబాద్,సెప్టెంబర్,7:**
శాసనసభ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాలకు పదును పెట్టింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అస్త్రశస్త్రాలతో సిద్ధం కావాలని పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తమ శాసనసభ్యులకు దిశానిర్దేశం చేశారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రజా సమస్యలేఅజెండాగా ప్రభుత్వాన్ని నిలదీయాలని,అసెంబ్లీని సమరానికి వేదికగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీఎం భాషపై తీవ్ర అభ్యంతరం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడుతున్న భాషపై కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బూతులు మాట్లాడుతుంటే, అలాంటి వ్యక్తితో మేం చర్చకు రావాలా? ఆయన భాష మార్చుకోవాలి. పాలన చేతకాకనే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు" అని కేసీఆర్ ఘాటుగా విమర్శించారు.

# అవంతి పీజీ కళాశాలలో ఘనంగా 'విద్యారంభం-2026'

## పరిశ్రమ నైపుణ్యాలతో ఉన్నత ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకోవాలి: ఓయూ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్







**బాగ్‌లింగంపల్లి, మహానది న్యూస్, సెప్టెంబర్ 07:** బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ ఉ పీజీ కళాశాల ఆధ్వర్యంలో నూతనంగా చేరిన ఎంబీఏ, ఎంసీఏ ప్రథమ సంవత్సర విద్యార్థులకు 'విద్యారంభం--2026' పేరిట ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యా వాతావరణం, మౌలిక వసతులు, విద్యార్థుల సమగ్ర వికాసానికి అందుబాటులో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ ఉ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాభ్యాసంలో ఉన్నత ప్రమాణాలు సాధించి, ఎంఎన్‌సీ సంస్థల్లో లెవల్-2 స్థాయి ఉద్యోగాలను లక్ష్యంగా ఎంచుకోవాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెం ట్లలో చురుగ్గా పాల్గొంటూ ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని, పరిశ్రమ అనుభవాన్ని ఒడిసి పట్టుకోవాలని పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూహెచ్‌స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ సంతోష్ కుమారి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు కార్పొరేట్ రంగానికి తగిన నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు.

అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ బి. సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో తమప్రతిభను పదునుపెట్టుకుని ఉజ్వల కెరీర్‌ను నిర్మించుకోవాలని దిశా నిర్దేశం చేశారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపక చైర్మన్,సీఈవో శ్రీ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు కళాశాలలోని విద్యా వనరులను, అధునాతన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొనిఅత్యుత్తమ ప్లేస్‌మెంట్లు సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో శ్రమించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సిస్టర్ అంజలి, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రజ్ఞ కుమార్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై. జయప్రద, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎస్. అప్పారావు, డాక్టర్ ఎస్. నాగరాజులతో పాటు కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గూగుల్ మ్యాప్స్ మార్గదర్శక సాంకేతికతతో సరికొత్త బజాజ్ పల్సర్ ద్విచక్ర వాహనాలు

## కాచిగూడ సిద్ధి వినాయక బజాజ్ విక్రయ కేంద్రంలో ఆవిష్కరించిన ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వర్



కాచిగూడ, మహానది న్యూస్, సెప్టెంబర్ 07: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, గూగుల్ మ్యాప్స్ ద్వారా ప్రతి మలుపునూ స్పష్టంగా సూచించే సరికొత్త బజాజ్ పల్సర్ ఎన్ 160, పల్సర్ 150, పల్సర్ 125 నూతన శ్రేణి వాహనాలను కాచిగూడ లోని సిద్ధి వినాయక బజాజ్ విక్రయ కేంద్రంలో సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. కాచిగూడ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ నూతన మోటార్ సైకిళ్లను సిద్ధి వినాయక ఆటో మొబైల్స్ చైర్మన్ బాబుల్ రెడ్డితో కలిసి మార్కెట్‌లోకి విడుదల చేశారు.

ఈ సందర్భంగా విక్రయ కేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ.. వాహనదారుల ప్రయాణ సౌలభ్యం కోసం బజాజ్ రైడ్ కనెక్ట్ ద్వారా తొలిసారిగా గూగుల్ మ్యాప్స్ మార్గదర్శకత్వం, బ్లూటూత్ అనుసంధానం, ఫోన్ కాల్స్ మరియు సందేశాల ముందస్తు హెచ్చరికలు వంటి అత్యాధునిక సాంకేతిక హంగులను ఈ వాహనాల్లో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

**నూతన వాహనాల ప్రత్యేకతలు:**

పల్సర్ ఎన్ 160: ఐదు అంగుళాల పూర్తి రంగుల డిజిటల్ తెర, గూగుల్ మ్యాప్స్ మార్గదర్శక నావిగేషన్, వివిధ ప్రయాణ రీతులు, అత్యాధునిక రెండు చక్రాల బ్రేకింగ్ భద్రతా వ్యవస్థ. పల్సర్ 150: ఐదు అంగుళాల డిజిటల్ తెర, బ్లూటూత్ అనుసంధానం, నిశ్శబ్దంగా వాహనం ప్రారంభమయ్యే సదుపాయం, మొబైల్ ఛార్జింగ్ వసతి. పల్సర్ 125: పూర్తి డిజిటల్ తెర, మలుపులను సూచించే మార్గదర్శకత్వం, గేర్ సూచిక, సురక్షితమైన సమగ్ర బ్రేకింగ్ వ్యవస్థ. కాచిగూడ ప్రధాన రహదారిలోని సిద్ధి వినాయక బజాజ్ విక్రయ కేంద్రంలో ఈ సరికొత్త పల్సర్ వాహనాలు వాహనదారుల పరిశీలనకు, ముందస్తు నమోదులకు మరియు తక్షణఅందజేతకు సిద్ధంగా ఉన్నాయని యాజమాన్యం తెలిపింది. కొనుగోలుదారుల కోసం ప్రత్యేక సులభ వాయిదాల రుణ సదుపాయాలు,ఆకర్షణీయమైన పాత వాహనాల మార్పిడి రాయితీలు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విక్రయ కేంద్రం నిర్వాహకులు, వాహన ప్రియులు పాల్గొన్నారు.

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

**విజయవాడ:** వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉ



ంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

**గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం**

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది.

# వరంగల్ గడ్డపై టీఆర్ఎస్ విస్తరణకు శ్రీకారం

## తరాలపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

## గ్రేటర్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేస్తాం.. ప్రజా సమస్యలే పార్టీ అజెండా

### టీఆర్ఎస్ చీఫ్ కవితకు ఘనంగా స్వాగతం పలికిన టీఆర్ఎస్ లీడర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్ రావు





**హనుమకొండ, మహానది న్యూస్,సెప్టెంబర్ 07:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) రాష్ట్రవ్యాప్త సంస్థాగత విస్తరణలో భాగంగా పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా.., హనుమకొండలో విద్యార్థులతో కలిసి నిరాహార దీక్షలో పాల్గొన్న ఆమె, అనంతరం తరాలపల్లి గ్రామానికి చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

కవితకు టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత ఘన స్వాగతం పలికారు. జై తెలంగాణ, టీఆర్ఎస్ నినాదాలతో తరాలపల్లి మారుమోగింది. ఈ సందర్భంగా పార్టీ చీఫ్ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికార రాజకీయాలకు భిన్నంగా ప్రజల సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు.

విద్య, వైద్యం ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండేలా ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా విధానాలను అమలు చేయడమే తమ సంకల్పమన్నారు. "గత రెండు దశాబ్దాలుగా ప్రజల మధ్యనే ఉన్నాను. మీ ఆశీర్వాదంతో సేవ చేసేందుకు ఈ రాజకీయ వేదికను ఏర్పాటు చేశాం. సమాజంలోని ప్రతి వర్గానికి సామాజిక న్యాయం జరిగేలా, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కృషి చేస్తాం" అని ఆమె పేర్కొన్నారు. పార్టీ జెండాలోని పసుపు రంగు శుభానికి, ధైర్యానికి, ప్రజా సంకల్పానికి ప్రతీక అని వివరిస్తూ, ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వానికే తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. రానున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించారు.

**పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**

పర్యటనలో భాగంగా తరాలపల్లిలో నిర్వహించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో కవిత పాల్గొన్నారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తీర్థప్రసాదం స్వీకరించిన కవిత భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు.

ఈ కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, విద్యార్థులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో చంచల్‌గూడ జైలు సిబ్బంది పిల్లల ప్రతిభ



హైదరాబాద్: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, హైదరాబాద్‌లో సెప్టెంబర్ 5, 6 తేదీలలో నిర్వహించిన టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్--2026 జాతీయ స్థాయి కరాటే పోటీలలో చంచల్‌గూడ జైలు సిబ్బంది పిల్లలు ఆరుగురు పాల్గొని తమ తమ విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ పోటీలలో బండారి ధాత్రి కుమితే విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించడం ప్రత్యేకంగా అభినందనీయమైన విషయం. జాతీయ స్థాయి పోటీలలో కఠినమైన పోటీని ఎదుర్కొని రజత పతకం సాధించిన ధాత్రి, తన తల్లిదండ్రులతో పాటు చంచల్‌గూడ జైలు సిబ్బందికి గర్వకారణంగా నిలిచారు. ధాత్రితో పాటు కటా విభాగంలో బక్క సుజయ్ దీప్, బక్క సహస్ర, చె. హంసలేఖ, చె.వినోద్ కుమార్,మరోజు కోవిద్ కాంస్య పతకాలు సాధించారు. చంచల్‌గూడ జైలుసిబ్బంది పిల్లలు జాతీయస్థాయి వేదికపై తమ ప్రతిభను చాటుతూ పతకాలు సాధించడం పట్ల జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ శ్రీమతి సౌమ్య మిశ్రా, ఐపీఎస్ గారు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించుకోవాలని సూచిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి,చంచల్‌గూడ కరాటే కోచ్ కరీం, మరియు అమృత రెడ్డి పాల్గొన్నారు.

# మండలి కోసం వడపోతలు షురూ

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర,జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# అనిల్ లో నిర్వేదం..

నెల్లూరు, : పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు. మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు.

# సంపాదకీయం

## సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి !

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఢిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

# భరద్వాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదు




న్యూఢిల్లీ: జంతర్‌మంతర్ వద్ద జులై 23న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనపై హిందుత్వ కార్యకర్తగా చెప్పుకునే స్వతంత్ర భరద్వాజ్‌పై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. భరద్వాజ్‌పై సెక్షన్ 307, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని, ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాతో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) అధినేత, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్, సీజేపీ కార్యకర్తలు పటేల్‌చౌక్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ ఆందోళన చేపట్టారు. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భరద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో ఢిల్లీ పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. సంజయ్‌కుమార్‌పై దాడి జరిగినప్పటి నుంచి న్యాయం కోసం పోరాడుతున్నామని అశుతోష్ రాంకా తెలిపారు. ఘటనకు సంబంధించి భరద్వాజ్‌పై కఠినమైన క్రిమినల్ సెక్షన్లు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నం సెక్షన్ కూడా నమోదు చేయాలన్నారు. సౌరవ్ దాస్ మాట్లాడుతూ దాడి గురించి బహిరంగంగా మాట్లాడుతున్న వ్యక్తి ఇంకా బయట ఎలా తిరుగుతున్నారని ప్రశ్నించారు.

## బడి ఉన్నంతకాలం విప్లవం ఉంటుంది...!



"విద్యార్థులతో తరగతి గదులు, టీచర్లతో పాఠశాలలు క్యూబాలో వున్నంత కాలమూ దేశం వుంటుంది, మాతృభూమి వుంటుంది. విప్లవం కూడా వుంటుంది. సోషలిజం కూడా వుంటుంది." అని క్యూబా అధ్యక్షులు, క్యూబా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ ఫస్ట్ కార్యదర్శి అయిన డియాజ్ కానెల్ మంగళవారం వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయుడు మెండివ్ యువ మార్టికి బోధిస్తున్న పాఠశాల ఆనవాళ్ళను కలిగివున్న ప్రదేశమైన పాత హవానాలోని ప్రముఖ పాసియో డెల్ ప్రాడియోలో క్యూబా అధ్యక్షుని పత్రికా బృందంతో డియాజ్ కానెల్ మాట్లాడారు. ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ప్రారంభించడం ప్రతి ఒక్కరి గురుతర బాధ్యత అని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన వ్యాఖ్యానించారు. క్యూబా విప్లవ యోధుడు ఫైడెల్ కాస్ట్రోకు ఇది ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. చుట్టూ పిల్లలు, టీనేజర్లు, యువకులు అందరూ గుమిగూడి వుండగా ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మూడు ముఖ్య అంశాలను విలేకర్లతో పంచుకున్నారు. అందులో మొదటిది ఈ ఏడాది పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభంతో తరగతి గదుల్లో నెలకొన్న విజయమని ప్రస్తావించారు. రెండవది, సమిష్టి ప్రయత్నంతో సాధించిన ఫలితాలని అన్నారు. ఇక మూడవది–మార్పులు, పరివర్తనలతో మునిగిపోయిన సమయంలో బోధనలో, అభ్యాసంలో మనం ఎదుర్కొంటున్న సవాలు అని అన్నారు. అమెరికా సుదీర్ఘ ఆంక్షల కారణంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఇంధన కొరత, ఉపాధ్యాయులు, ఇతర సామాగ్రి, పరికరాలు ఇలా అన్నీ కొరతగానే వున్నా 2026–27 విద్యా సంవత్సరానికి పాఠశాలలను తిరిగి ప్రారంభించాలన్న క్యూబా ధృఢ నిశ్చయాన్ని అధ్యక్షులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

విద్య పట్ల విప్లవానికి వున్ననిబద్ధత, జాతీయ ధృఢత్వానికి ఇదొక నిదర్శనంగా కనిపిస్తోంది. ఎంతటి ప్రతికూల పరిస్థితులెదురైనా విద్యను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. తరగతి గదుల్లోనే విజయం నెలకొంటుందని అన్నారు. విద్యా వ్యవస్థను ఎలాగైనా సుస్థిరంగా కొనసాగించాలని ఉపాధ్యాయులు, కుటుంబాలు, కమ్యూనిటీలు, సంస్థలు, వ్యవస్థలు ఇలా అన్నీ భావించాయని, వారందరి సమిష్టి కృషి ఫలితమే ఈ రోజని వ్యాఖ్యానించారు. దేశాన్ని, విప్లవాన్ని, సోషలిజాన్ని పరిరక్షించుకోవాలంటే ముందుగా విద్యను పరిరక్షించుకోవడం అత్యంత అవశ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వర్గానికి కూడా అధ్యక్షుడు ఒక విజ్ఞప్తి చేశారు.

## బొలీవియాలో సైనిక స్థావరంలో భారీ పేలుడు..



దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని లాపాజ్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని వియాచా మున్సిపాలిటీలో సైనిక స్థావరంలో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం 10 మంది మృతి చెందగా, 62 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య 10 నుంచి 15 వరకు ఉండొచ్చని స్థానిక ఆరోగ్య శాఖ డైరెక్టర్ రీటా నెబ్రాస్కా తెలిపారు. సైనిక స్థావరంలోని రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పైరోటెక్నిక్ పదార్థాల నిల్వ ప్రాంతంలో పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు.

పేలుడు ధాటికి చుట్టుపక్కల ఇళ్ల కిటికీలు ధ్వంసమయ్యాయి. క్షతగాత్రుల్లో ఎక్కువ మంది పౌరులేనని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక, వైద్య, రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. మరో పేలుడు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించి, ప్రజలు ఘటనాస్థలానికి కనీసం 150 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. పేలుడుకు గల కారణాలపై ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభించింది.

# ఇప్పుడప్పుడే చర్చల్లేవ్

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడి...



ఇరాన్ విషయంలో ఏం చేయాలనే దానిపై అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చెప్పారు. ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అనేక మార్గాలు తమ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. అయితే ఇరాన్‌తో ఇప్పుడప్పుడే చర్చలు జరిపే ప్రసక్తే లేదని తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు ఆపేంతవరకూ ఆ దేశంతో చర్చలు జరపబోమని అన్నారు. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ వాన్స్ అధ్యక్షభవనంలో విలేకరులతో మాట్లాడారు. 'దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపేంతవరకూ ఇరాన్‌తో చర్చించబోమని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు' అని గుర్తు చేశారు. వాణిజ్య నౌకలపై ఇరాన్ జరుపుతున్న దాడులు రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడానికి ప్రధాన అడ్డంకిగా మారాయని చెప్పారు. చర్చలు తిరిగి ప్రారంభం కావాలంటే నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఇరాన్ ఆపేయాలని సూచించారు. ఇరాన్‌పై తాము చేపట్టిన సైనిక చర్యల కారణంగానే హోర్ముజ్‌లో నౌకాయానం పెరగడానికి అనువైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. నవంబరులో మధ్యంతర ఎన్నికలు జరిగే వరకూ ఘర్షణలు కొనసాగుతాయా అని విలేకరులు ప్రశ్నించగా 'నేను దానిని యుద్ధంగా అనుకోవడం లేదు' అని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి కాల్పులు జరగడం లేదని, ఆరు వారాల తర్వాత ప్రధాన ఆపరేషన్స్ ముగిసిపోయాయని చెప్పుకొచ్చారు. అయితే కొన్ని ప్రాంతాలలో తిరిగి పోరు ప్రారంభమైందని, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితికి ముగింపు లభిస్తుందా అని అడిగిన ప్రశ్నకు వాన్స్ బదులిస్తూ నిర్దిష్టమైన గడువు ఏదీ చెప్పలేనని, నౌకలపై జరుగుతున్న దాడులకు సంబంధించి ఇరాన్ నిర్ణయంపై అది ఆధారపడి ఉంటుందని చెప్పారు.

అసలు ఈ ప్రశ్నను ఇరాన్‌నే అడగాలని సూచించారు. పరిస్థితి క్షీణిస్తే ఇరాన్‌పై వేర్వేరు రూపాలలో ఒత్తిడిని కొనసాగిస్తామని అన్నారు. వెనిజులా చమురు నిల్వలపై నియంత్రణను అమెరికాకు బదిలీ చేసేందుకు ఉద్దేశించి కుదుర్చుకున్న ఒప్పందంతో అంతర్జాతీయ చమురు ధరలు దిగివచ్చాయని చెప్పారు.

ఇరాన్‌పై తాము చేసిన యుద్ధానికి తగినంత సహకారం అందించని మిత్రదేశాలపై ఆయన మండిపడుతూ ఇంధన సంక్షోభాన్ని ట్రంప్ ఒంటిచేత్తోనే నిరోధించారని కొనియాడారు. ఇరాన్‌లోని సిరిక్ నగరంలో వివాహ వేడుకపై అమెరికా జరిపిన దాడి గురించి ప్రశ్నించగా దానిపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఒకవేళ సైన్యం తప్పు చేస్తే గుణపాఠం నేర్చుకుంటుందని వాన్స్ అన్నారు.

## ఎయిర్‌బస్ ఒప్పందం కేసులో శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు అరెస్టు



శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు, పార్లమెంట్ సభ్యుడు నమల్ రాజపక్సను ఆ దేశ అవినీతి నిరోధక సంస్థ శుక్రవారం అరెస్టు చేసింది. 2013లో జరిగిన ఎయిర్‌బస్ విమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన అవినీతి ఆరోపణలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అరెస్టు చేసినట్లు లంచం లేదా అవినీతి ఆరోపణలపై విచారణ కమిషన్ వెల్లడించింది. నమల్ రాజపక్సను ఎయిర్‌బస్ లావాదేవీకి సంబంధించి విచారణ కోసం పిలిపించిన అనంతరం అరెస్టు చేసినట్లు కమిషన్ అధికారులు తెలిపారు. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. అయితే నమల్‌పై కచ్చితంగా ఏ ఆరోపణలు నమోదయ్యాయన్నది వెంటనే స్పష్టంగా తెలియలేదు. 2016లో అప్పటి ప్రభుత్వం రద్దు చేసిన సుమారు 2.3 బిలియన్ డాలర్ల ఎయిర్‌బస్ ఒప్పందానికి సంబంధించిన దర్యాప్తులో ఈ అరెస్టు జరిగినట్లు నమల్ తరఫు న్యాయవాది నిశాంత్ దయానంద ధృవీకరించారు. ఈ వ్యవహారంలో మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సను కూడా కమిషన్ మే నెలలో ప్రశ్నించింది. ఎయిర్‌బస్ విమానాల కొనుగోలులో లంచాలు స్వీకరించారన్న ఆరోపణలపై ఆయనను అధికారులు విచారించారు. ఎయిర్‌బస్ సంస్థ నుంచి వచ్చిన నిధుల్లో కొంత భాగం శ్రీలంక ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు చేరిందన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోంది. అయితే లంచాలు స్వీకరించారన్న ఆరోపణలను రాజపక్స కుటుంబం ఖండించింది.

తమపై నమో దవుతున్న అవినీతి ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని పేర్కొంది. ఇదిలా ఉండగా, శ్రీలంక ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కపిల చంద్రసేన మార్చిలో దర్యాప్తు అధికారులకు కీలక వాంగ్మూలం ఇచ్చారు. తాను రాజపక్సకు సుమారు ఐదు లక్షల డాలర్ల లంచం చెల్లించినట్లు ఆయన తొలుత వెల్లడించారు. అయితే ఆ ప్రకటనను ఒత్తిడి కారణంగా ఇచ్చానని చెబుతూ అనంతరం వెనక్కి తీసుకున్నారు. చంద్రసేన మే నెలలో, మళ్లీ అరెస్టు కావడానికి కొద్ది రోజుల ముందు ఒక బంధువు ఇంట్లో మృతి చెందారు. ఆయన మరణానికి కారణం ఇప్పటికీ నిర్ధారణ కాలేదు.

## భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు దీపస్తంభం అపోలో 10 ప్రయోగం

1969 మే 26 కేవలం ఒక తేదీ కాదు, అది మానవ చరిత్రలో ఒక సువర్ణ క్షణం. మానవ చరిత్రకు కొత్త ఊపిరి పోసిన అపోలో 10 వ్యోమనౌక, ఆకాశాన్ని దాటి చంద్రుని సన్నివేశానికి చేరి, భూమిని తిరిగి చేరిన గొప్ప సన్నివేశం. అది కేవలం ఒక అంతరిక్ష యాత్ర కాదు –అది ఒక కల, ఒక ఆశ, ఒక సాహసగాథ. మే 18న అమెరికా ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి ఆకాశాన్ని చీల్చుకుంటూ సాటర్న్ ఎ రాకెట్ ప్రయాణం మొదలు పెట్టింది. ఆ రాకెట్‌లోని కమాండ్ మాడ్యూల్‌కి "చార్లి బ్రౌన్" అని, లూనార్ మాడ్యూల్‌కి "స్నూపీ" అని పేర్లు పెట్టారు -- ఇవి చిలిపి శబ్దాల వెనుక ఒక అపారమైన సాంకేతిక విజ్ఞానం దాగుంది. థామస్ స్టాఫర్డ్, జాన్ యంగ్, యూజీన్ సెర్నన్ అనే ముగ్గురు వ్యోమగాములు ఆకాశంలో కొత్త చరిత్ర రాసేందుకు బయలుదేరారు. చంద్రుని చుట్టూ వలయమై తిరిగే కక్ష్యలోకి చేరాక, స్నూపీ కమాండ్ మాడ్యూల్ నుండి విడిపోయి చంద్రుని ఉపరితలానికి కేవలం 15.6 కిలోమీటర్ల దూరంలోకి దిగి వచ్చింది. ఆ దృశ్యం -- తెల్లటి ధూళితో ముదురిన చంద్ర ఉపరితలం కింద వింతల సౌందర్యం, ఆపై నీలాకాశపు కిరణాల మధ్య తిరుగుతున్న స్నూపీ -- అది కేవలం ఒక సాంకేతిక ప్రక్రియ కాదు, అది మానవ స్వప్నాలకు దారిచెప్పిన క్షణం. స్నూపీ ద్వారా చంద్రుని భూభాగాలను పరిశీలించడం, భవిష్యత్తులో మనిషి అడుగును నిలిపే స్థలాన్ని అంచనా వేయడం మాత్రమే కాక, అంతరిక్షంలో మనిషి ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. జాన్ యంగ్ చార్లి బ్రౌన్‌లో ఉండి ఈ ప్రయాణాన్ని పర్యవేక్షిస్తూ సాంకేతిక క్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాడు. ఆత్మనిర్వహణలో, సాంకేతిక నియంత్రణలో ఈ మిషన్ ఒక అద్భుత ఘట్టం. అపోలో 10 తన యాత్రను విజయ వంతంగా ముగించుకొని మే 26, 1969న భూమి మీద పసిఫిక్ మహా సముద్రంలో సురక్షితంగా ల్యాండింగ్ చేసింది. వ్యోమగాములు భూమికి తిరిగి వచ్చారు -- ఆకాశాన్ని తాకి మళ్లీ మన ధరణిపై అడుగు పెట్టారు. అపోలో 10 ద్వారా చంద్రుని తలుపులు తెరచ బడ్డాయి; ఆ తరువాతి అపోలో 11 మిషన్‌లో నీల ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రిన్ చంద్రునిపై అడుగు పెట్టడానికి దారి వేసింది. ఇది కేవలం సాంకేతిక ప్రయోగం మాత్రమే కాదు -- అది మానవ కర్తవ్యానికి, ఊహలకు, సాహసానికి నిలిచిన జ్ఞాపకం. అపోలో 10 మిషన్ అంతరిక్ష చరిత్రలో ఒక గొప్ప కవిత, ఒక స్ఫూర్తిదాయక గాథ. అది మనిషి ఆత్మ విశ్వాసానికి ప్రతిబింబం. 1969 మే 26 కేవలం ఒక తేదీ కాదు, అది మానవ చరిత్రలో ఒక సువర్ణ క్షణం. ఆకాశాన్ని దాటి చంద్రుని చేరువలో ఒక అడుగు వేసిన ఈ మిషన్, భవిష్యత్తు అంతరిక్ష యాత్రలకు దీపస్తంభంలా నిలిచింది. థామస్ స్టాఫర్డ్, జాన్ యంగ్, యూజీన్ సెర్నన్ అనే ముగ్గురు వ్యోమగాములు ఆకాశంలో కొత్త చరిత్ర రాసేందుకు బయలుదేరారు. అపోలో 10 తన యాత్రను విజయ వంతంగా ముగించుకొని మే 26, 1969న భూమి మీద పసిఫిక్ మహా సముద్రంలో సురక్షితంగా ల్యాండింగ్ చేసింది. వ్యోమగాములు భూమికి తిరిగి వచ్చారు -- ఆకాశాన్ని తాకి మళ్లీ మన ధరణిపై అడుగు పెట్టారు. అపోలో 10 ద్వారా చంద్రుని తలుపులు తెరచ బడ్డాయి; ఆ తరువాతి అపోలో 11 మిషన్‌లో నీల ఆర్మ్‌స్ట్రాంగ్, సాహసానికి నిలిచిన జ్ఞాపకం. అపోలో 10 మిషన్ అంతరిక్ష చరిత్రలో ఒక గొప్ప కవిత, ఒక స్ఫూర్తిదాయక గాథ.చంద్రుని చుట్టూ వలయమై తిరిగే కక్ష్యలోకి చేరాక, స్నూపీ కమాండ్ మాడ్యూల్ నుండి విడిపోయి చంద్రుని ఉపరితలానికి కేవలం 15.6 కిలోమీటర్ల దూరంలోకి దిగి వచ్చింది.

# ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: అధికారులకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశం

## - ప్రజావాణిలో 56 ఫిర్యాదులు..







**రంగారెడ్డి, మహానది న్యూస్, సెప్టెంబర్ 07:** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 56 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 27 ఉండగా, ఇతర శాఖలకు సంబంధించి 29 వినతులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సత్వర సేవలు అందించాలని స్పష్టం చేశారు. మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14న వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణహితంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ..?!

**నెల్లూరు,** : తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తేలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి. ఆది నుంచి మేకపాటి ఫ్యామిలీ వ్యాపార రంగంలో స్థిరపడింది. కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్ చేశారు మేకపాటి. అప్పటినుంచి ఆయన పార్టీ మారుతారు అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

## - ప్రజలకు ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ నాయకుల డిమాండ్





**ఎల్బీనగర్, మహానది న్యూస్, సెప్టెంబర్ 07 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హామీలను అమలు చేసి ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరుతూ సరూర్‌నగర్ మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, రైతు భరోసా, ప్రతి పంటకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కూలీలకు రూ. 12,000 ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన పింఛన్లు అందించాలని కోరారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12,000 ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, విద్యార్థులు, యువత, రైతులకు ఇచ్చిన హామీలతో పాటు గ్రామాలు, పట్టణాల్లో పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడంపై కర్మన్‌ఘాట్‌లో నిరసన**

ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కర్మన్‌ఘాట్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, ప్రతిపక్ష నేతల గొంతుకను అణచివేసే వైఖరిని ప్రభుత్వం విడనాడాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు రాకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్ట రాజశేఖర్‌రెడ్డి, భవాని ప్రవీణ్‌కుమార్, పద్మానాయక్, సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, వరప్రసాద్‌రెడ్డి, సత్యంచారి, శ్రీశైలం యాదవ్, రాజిరెడ్డి, తోట మహేష్‌యాదవ్, జక్కిడి మల్లారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల కోసం అసెంబ్లీ ముట్టడి

## - బీజేపీ నాయకులు, కార్యకర్తల అరెస్టును ఖండించిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**బి.యన్ రెడ్డి నగర్, మహానది న్యూస్, సెప్టెంబర్ 07** : నిరుపేద విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన 'ఫీజు బకాయి – – బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా సోమవారం అసెంబ్లీ ముట్టడి చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొని విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసించారు. రాష్ట్రంలో సుమారు రూ. 15,000 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బకాయిల కారణంగా లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని లచ్చి రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు పోరాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తున్న వారిపై పోలీసు బలగాలను ప్రయోగించడం దుర్మార్గమని విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీధర్ రావు, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రావు, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై నిరసన

## - ఇబ్రహీంపట్నంలో ధర్నా, రాస్తారోకో.. సీఎం దిష్టిబొమ్మ దగ్ధం





**ఇబ్రహీంపట్నం, మహానది న్యూస్, సెప్టెంబర్ 07:** అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీలో ఎదుర్కోలేక వారి గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ మంగళ్‌పల్లి చౌరస్తా వద్ద సాగర్ హైవేపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులను ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్ష గొంతును వినిపించేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానం

## - కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, మహానది న్యూస్, సెప్టెంబర్ 07:** అసెంబ్లీ స్పీకర్ వంటి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఓ ఎమ్మెల్సీ అసభ్య పదజాలంతో, అమర్యాదకరంగా మాట్లాడటాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉండటం సహజమేనని, విధానాలపై విమర్శలు చేయవచ్చని, అయితే రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఏ విధంగానూ సమర్థనీయం కాదన్నారు. ప్రజాప్రతినిధులు తమ హోదా, బాధ్యతలను గుర్తించి సంయమనం పాటిస్తూ మాట్లాడాలని సూచించారు. ప్రత్యేకించి దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ ఆయనను అవమానించేలా మాట్లాడటం ఆందోళనకరమన్నారు. దళితులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి ఎదిగి, అత్యున్నత పదవులు అలంకరిస్తున్నప్పటికీ వారిపట్ల వివక్ష, చిన్నచూపు, అవమానకర ధోరణి కొనసాగడం దురదృష్టకరమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితుల పట్ల మానసిక వివక్ష కొనసాగడం బాధాకరమని కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవం కల్పించినప్పటికీ, దళితులు ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా వారిని చిన్నచూపు చూసే ధోరణి కొనసాగడం సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమన్నారు. ఒక దళితుడు అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న సమయంలో కూడా ఇలాంటి అవమానకర వ్యాఖ్యలకు గురికావడం కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, దళిత సమాజం పట్ల ఉన్న వివక్షపూరిత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. సదరు ఎమ్మెల్సీపై శాసనసభ నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం



కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది. జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రైలు కార్యకలాపాల భద్రతకు అధిక ప్రాధాన్యత:దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ






**సికింద్రాబాద్, మహానది న్యూస్, సెప్టెంబర్ 07:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం సవివరమైన సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు సమావేశంలో పాల్గొన్నారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సిగ్నల్ అండ్ టెలికాం, పాయింట్స్‌మెన్, ఇంజినీరింగ్ తదితర సిబ్బంది భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జీఎం సూచించారు. విధుల సమయంలో రెట్రో–రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఇతర భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా సిబ్బందిలో అవగాహన పెంచాలని ఆదేశించారు. షంటింగ్ కార్యకలాపాల సమయంలో పాటించాల్సిన భద్రతా నిబంధనలపై సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డివిజన్లకు సూచించారు. రైలు సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పనులు పూర్తయిన వెంటనే నిర్మాణ సామగ్రిని పని ప్రదేశాల నుంచి తొలగించాలని జీఎం స్పష్టం చేశారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే ఆకతాయిలను అడ్డుకునేందుకు, రైలు కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా రైల్వే పట్టాల వెంట అప్రమత్తంగా ఉండాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాక్‌లు, కోచ్‌లు, వ్యాగన్లు తదితర రైల్వే ఆస్తుల నిర్వహణపై సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని జీఎం ఆదేశించారు. రైళ్ల సురక్షిత నిర్వహణకు సంబంధించి రైల్వే సిబ్బందితో పాటు కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు కూడా నిర్దేశిత భద్రతా ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. చిన్నపాటి లోపం లేదా అసౌకర్యం తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించే విధానాన్ని పటిష్టం చేయాలని, తద్వారా సమస్యలను సకాలంలో గుర్తించి తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు వీలుంటుందని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

# తెలుగు ఎంపీలు మరీ ఇంత దారుణమా..?

న్యూఢిల్లీ, : లోక్ సభ రాజ్యసభ ఎంపీలకు తమ నియోజకవర్గాలలో ఖర్చు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుంది. అలా వచ్చిన నిధులను సకాలంలో ఖర్చు చేయకపోతే మురిగి పోతాయి. లోక్ సభ సభ్యులకు సొంత నియోజకవర్గంగా పార్లమెంట్ పరిధి ఉంటుంది. ఇక రాజ్యసభ సభులు అయితే నోడల్ జిల్లాను ఎంచుకుని అక్కడ నిధులను ఖర్చు పెట్టవచ్చు. వారు అవసరం అనుకుంటే ఎక్కడైనా నిధులు కేటాయించవచ్చు. మరి ఇంతలా కేంద్రం నుంచి నిధులు వస్తున్నప్పటికీ ఖర్చు విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు వెనకబడి ఉన్నారని నివేదికలు తెలియచేస్తున్నాయి. ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాల ఎంపీలు ముందు వరసలో ఉన్నారని వారు తమకు కేటాయించిన నిధులను బాగానే ఖర్చు చేశారు అని నివేదికలు చెబుతున్నాయి.ఇదిలా ఉంటే కేంద్ర గణాంక కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం చూస్తే తెలుగు రాష్ట్రాలలో ఎంపీలు తక్కువగా ఎంపీ ల్యాడ్స్ ని ఖర్చు చేశారు అని తెలుస్తోంది. అందులో కూడా తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధులను అత్యంత తక్కువగా ఖర్చు చేశారని ఈ నివేదిక చెబుతోంది. దేశవ్యాప్తంగా చూస్తే ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగం సగటున 75 శాతం ఉండగా తెలంగాణ ఎంపీల సగటు కేవలం 23 శాతం మాత్రమే ఖర్చు చేసినట్లుగా నమోదైంది. రెండు సంవత్సరాల కాలంలో తమకు కేటాయించిన నిధులలో కేవలం పది శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన ముఖ్య తెలుగు ఎంపీల జాబితా కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్ సభ్యుల ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వినియోగ శాతం జాతీయ సగటు కంటే చాలా తక్కువగా ఉంది అని అంటున్నారు. దీని మీద పౌర సమాజ ప్రాజెక్ట్ అయిన ఎంపవర్డ్ ఇండియన్ విడుదల చేసిన 2026 నాటి తాజా గణాంకాల ప్రకారం చూస్తే , ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మొత్తం 37 మంది ఎంపీలు అంటే లోక్ సభలో లోకసభ రాజ్యసభ కలిపి కేటాయించిన నిధులు వాటి వినియోగ వివరాలు చూస్తే ఖర్చు తక్కువగానే చేసినట్లుగా ఉంది. మొత్తం 554.5 కోట్లు నిధులలో వినియోగ శాతం కేవలం 22.86 శాతంగా ఉంది.ఇదిలా ఉంటే ఎంపీ ల్యాడ్స్ నిధులు ఖర్చు



చేసినా పోర్టల్ అప్‌డేట్ లోపాలు ఉన్నాయని ఎంపీల ఆఫీసుల నుంచి వస్తున్న మాటగా ఉంది. పనుల్లో జాప్యానికి ప్రధాన కారణాలు అనేకం ఉన్నాయని ంటున్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనులు పూర్తి కాకపోవడానికి బిల్లులు విడుదల కాకపోవడానికి గల కారణాలు ఉన్నయాని చెబుతున్నారు. అలాగే ఆమోదాల విషయంలో జాప్యం కూడా జరుగుతోందని అంటున్నారు. ఎంపీలు అభివృద్ధి పనుల కోసం సిఫార్సు లేఖలు ఇచ్చినప్పటికీ జిల్లా యంత్రాంగం వాటికి త్వరితగతిన పరిపాలనా అనుమతులు ఇవ్వకపోవడంతో పాటు నిర్వహణ సంస్థల నిర్లక్ష్యం కూడా ఉందని అంటున్నారు: మున్సిపల్ కార్పొరేషన్లు పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా వంటి ప్రభుత్వ అమలు సంస్థలు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం కూడా ఎంపీ ల్యాడ్స్ ఖర్చు విషయంలో కొంత వెంకబటుతనానికి కారణం అని చెబుతున్నారు. ఇక పోర్టల్ అప్‌డేట్స్ లో లోపాలూన్నయాని అంటున్నారు. క్షేత్రస్థాయిలో కొన్ని పనులు జరుగుతున్నప్పటికీ వాటి వివరాలను జిల్లా ప్రణాళిక అధికారులు కేంద్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయకపోవడం వల్ల కూడా నివేదికలలో ఎంపీలు తక్కువ ఖర్చు చూపిస్తోంది అని అంటున్నారు. ఏది ఏమైనా తెలుగు ఎంపీలు తమకు కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ ని వేగంగా ఖర్చు చేస్తే వాటి ఫలితాలు అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువ అవౌతాయని అంటున్నారు.

# కవిత ఆ వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారా

హైదరాబాద్: తెలంగాణా రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వైఖరి ఆమె రాజకీయ ధోరణి ప్రత్యర్థులను ఎంచుకునే విధానం అదే సమయంలో ఆమె చేస్తున్న విమర్శలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఆమె తన సొంత కష్టాలను జనంలో పెడుతూ కన్నీరు పెడుతున్నారు. ఆమె తనను బీఆర్ఎస్ ఎందుకు సస్పెండ్ చేసింది అని ప్రశ్నిస్తున్నారు. తండ్రి కేసీఆర్ కి తనకు మధ్య చిచ్చు పెట్టారంటూ కొందరు నేతల మీద విమర్శలు చేస్తున్నారు. ప్రత్యేకించి రెడ్లను ఆమె టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఎందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు అన్నదే ఇపుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. సోషల్ మీడియా కోసమా : ఇదిలా ఉంటే కల్వకుంట్ల కవిత సోషల్ మీడియాలో ప్రచారం కోసం మాట్లాడుతున్నారు అన్న చర్చ సాగుతోంది. ఆమె ఏమి మాట్లాడాలనుకుంటున్నారు, ఏమి మాట్లాడుతున్నారు అన్నది అర్థం కావడం లేదని అంటున్నారు. ఆమె మాటలు ఆమె చేస్తున్న వ్యాఖ్యల మీద బయట ఇదే డిస్కషన్ అవుతోంది. కవిత ఎంపీగా చేశారు, ఎమ్మెల్సీగా చేశారు, కానీ ఆమె చేస్తున్న విమర్శలు కానీ రాజకీయ వ్యాఖ్యానాలు కానీ పరిణితి లేకుండానే చేస్తున్నారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆమె ఏ రోజు ఎవరిని టార్గెట్ చేస్తారో కూడా అర్థం కావడం లేదని అంటున్నారు. ఒక రోజు ఆమె హరీష్ రావు మీద ఘాటు అయిన విమర్శలు చేస్తారు. ఆ మరుసటి రోజు హరీష్ రావుని క్షమిస్తాను అంటారు, ఆ వెంటనే మరో నేత మీద మండిపడతారు, ఇలా ఆమె చేస్తున్న విమర్శలకు విలువ ఉంటుందా అన్న చర్చ సాగుతోంది. ఇక కవిత హరీష్ రావుని తిడుతూ ఒక రోజు స్టేట్మెంట్ ఇస్తారు, ఆ మరుసటి రోజే సంతోష్ రావుని ఘాటుగా విమర్శిస్తారు. వీళ్లే నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించారు అని ఆమె అంటారు, ఇదంతా సోషల్ మీడియాలో మైలేజ్ కోసం ఆమె ఇలా మాట్లాడుతున్నారు అని అంటున్నారు. అయినా సరే ఆమె అనుకున్న మైలేజ్ రావడం లేదని కూడా వినిపిస్తోంది. తాజాగా ఆమె నిజామాబాద్ మీటింగులో మాట్లాడుతూ తాను హరీష్ రావుని సంతోష్ రావుని క్షమిస్తానేమో కానీ ప్రశాంత్ రెడ్డిని అసలు క్షమించను అంటూ హాట్ కామెంట్స్ చేశారు. దీంతో ఆమె బాధ ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదని అంటున్నారు. కవిత మాట్లాడుతున్నది చూస్తే ఫక్తు ఫ్యామిలీ పంచాయతీగానే ఉంది. ఆమె బీఆర్ఎస్ నుంచి ఆ మధ్యన సస్పెండ్ అయ్యారు. ఈ రోజుకీ ఆమె అదే మాట మాట్లాడుతున్నారు. ఇదంతా జనంలో సానుభూతి కోసమే అని అంటున్నారు. అయితే అది రాకపోవడంతో ఆమె ఎవరెవరినో ముందు పెట్టి విమర్శలు చేస్తున్నారు. నిజానికి బీఆర్ఎస్ కేసీఆర్ ది. దాని వ్యవహారాలు మొత్తం చూస్తోంది కేటీఆర్. మరి ఒకరు తండ్రి అయితే మరొకరు అన్నయ్య, ఇలా సాగే ఫ్యామిలీ పంచాయతీలో ప్రశాంత్ రెడ్డికి కానీ మరొకరికి కానీ ఏమి సంబంధం ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ కి ఎవరైనా



కవిత గురించి చాడీలు చెబితే వింటారా, ఆయన ఎంతటి సీనియర్ నాయకుడో అందరికీ తెలుసు కదా అంటున్నారు. పైగా కుమార్తె గురించి తండ్రికి చెప్పే పరిస్థితి ఉంటుందా అని అంటున్నారు. తనను పార్టీ నుంచి బయటకు పంపాలన్నా ఉంచాలన్నా కేసీఆర్ కి కేటీఆర్ కే సర్వాధికారాలు ఉంటాయని ఆమెకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. కానీ వారిని వదిలేసి వేరే వాళ్లను అంటే లాభమేంటి అన్న ప్రశ్నలు వస్తున్నాయి. రెడ్లను దూరం చేసుకుంటే : తెలంగాణా రాజకీయాల్లో రెడ్లు బలమైన శక్తిగా ఉన్నారు. నిజానికి బీఆర్ ఎస్ రెండు సార్లు అధికారంలోకి రావడానికి రెడ్లు కూడా ప్రధాన కారణం అని చెబుతారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి పార్టీ పరంగానే ఓటు బ్యాంక్ ఉంది కానీ సొంతంగా సామాజిక వర్గం ఓట్లు ఎంత అన్న చర్చ వస్తోంది. అలాంటిది రెడ్ల మీద విరుచుకుపడితే కవిత కొత్త పార్టీకి కూడా లాభమేంటి అని అంటున్నారు. అయినా సరే కవిత ప్రతీ జిల్లా తిరుగుతూ అక్కడ రెడ్డి నాయకుల మీద నోరు పారేసుకుంటున్నారు అని అంటున్నారు. ఆమె ఈ మధ్యనే నల్గొండ జిల్లాకు వెళ్లి జగదీశ్వర రెడ్డిని అంటే ఆయన లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేశారు అని అంటున్నారు. ఆ తర్వాత ఆమె నుంచి నో కామెంట్ అన్నట్లుగా ఫుల్ సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. ఇక మహబూబ్ నగర్ జిల్లాకు వెళ్ళి మరో రెడ్డి ఆయనను అంటే ఆయన కూడా ఘాటుగానే కౌంటర్ ఇచ్చేశారు. రాజకీయం చేయడం అంటే : ఇపుడు నిజామాబాద్ వెళ్ళి ప్రశాంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. నిజానికి కవిత తన పార్టీ బీసీల కోసం అని చెప్పుకుని తిరుగుతున్నారు కానీ బీసీలతో ఆమెకు సంబంధం ఏంటని బీసీ సంఘాలే ప్రశ్నిస్తున్నారు. రాజకీయం చేయడం అంటే ఇది కాదు కదా అని కూడా అంటున్నారు. తమ పార్టీ విధానాలు చెప్పుకోవాలి, నిర్మాణాత్మక విమర్శలు చేయాలి, అధికార పార్టీ తప్పులు ఉంటే ఎత్తి చూపాలి కానీ తమ కుటుంబ పంచాయతీలు జనంలో ఎత్తుకుని కన్నీరు పెట్టినా లేక ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసినా నష్టం తప్ప లాభం ఏమి ఉంటుందని అంటున్నారు. మొత్తానికి కవిత రాజకీయం అంతా సోషల్ మీడియాలో హైప్ కోసం అన్నట్లుగానే ఉందని కామెంట్స్ వస్తున్నాయి.

# ఆయిల్ పామ్ కు డబుల్ బొనంజా



ఖమ్మం, : ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పంట పండింది. ఆయిల్ పామ్ గెలల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. టన్ను గెలల ధర రూ.24,025కు పెరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగు చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు తెలిపారు. దీంతో ఆయిల్ పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై నెలలో టన్ను గెలలకు రూ.23,783 ధర అమలులో ఉండగా.. ఆగస్టు చివరి నాటికి మరో రూ.242 పెరిగి రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లలో పామాయిల్ ధరల కదలికలు, ఉత్పత్తి పరిస్థితులు తదితర అంశాల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటుంటాయని నిపుణులు చెబుతున్నారు.ఇక గెలల ధర పెరగడమే కాకుండా రైతులకు చెల్లింపుల విషయంలోనూ ఆయిల్‌ఫెడ్ కీలక మైలురాయిని చేరింది. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.175 కోట్లను ఆయిల్ పామ్ రైతులకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని రైతులకు చెల్లించడం సంస్థ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఆయిల్ పామ్ పంటకు సాధారణ పంటలతో పోలిస్తే దీర్ఘకాలిక పెట్టుబడి, నిర్వహణ అవసరమైనప్పటికీ.. గెలల ధరలు మెరుగ్గా ఉంటే రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రికార్డు ధర నమోదవడం వల్ల సాగు విస్తీర్ణం పెంచుకోవాలనుకునే రైతుల్లోనూ ఆసక్తి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు.తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. నీటి వసతి, నాట్లకు సంబంధించిన సహాయం, డ్రిప్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు మార్కెటింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పామాయిల్ దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం కూడా ఆయిల్ పామ్ సాగు విస్తరణ వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా అధికారులు చెబుతున్నారు.ఆయిల్ పామ్ గెలలకు రికార్డు ధర లభించడం తమకు ఎంతో ఊరటనిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, నీటి నిర్వహణ వంటి వ్యయాలు పెరుగుతున్న సమయంలో గెలలకు లభిస్తున్న మెరుగైన ధర ఆదాయాన్ని పెంచుతుందని చెబుతున్నారు. ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే ఆయిల్ పామ్ సాగు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అధికారులు..మేమే లోకల్...

హైదరాబాద్, : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అలిగి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ముఖ్య అతిథి అయిన దానం రాకుండానే అధికారులు లక్కీ డ్రా నిర్వహించడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే ఆ వ్యవహారంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాత బస్తీ ఎమ్మెల్యేల లాగా అధికారులపై దాడి చేస్తేనే వారు మాట వింటారు అంటే అలా చేయడానికి రెడీ అని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు.అంతేకాదు, ప్రభుత్వ అధికారులను కొట్టడం తనకు కొత్తేమీ కాదని, అది తనకు అలవాటేనని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గతంలో ఒక ప్రభుత్వ అధికారిని కొట్టి జైలుకు కూడా పోయానని మీడియా ముందే ఆయన వ్యాఖ్యానించడం విశేషం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, లబ్ధిదారుల జాబితాలో తన నియోజకవర్గం వారు కాకుండా బయటివారు ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్ తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన అన్నారు. ఆయన వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని, అసెంబ్లీలో కూడా ఈ వ్యవహారం గురించి ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని అన్నారు.అధికారులు వస్తుంటారు పోతుంటారు?దానం నాగేందర్ లోకల్ అంటూ ఇడియట్ లో రవితేజ మాదిరి డైలాగ్ చెప్పారు దానం. ప్రభుత్వంపై అసంతృప్తి లేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించొద్దని స్పష్టం చేశారు. ఎక్కడో కుట్ర జరుగుతోందని, అధికారుల ప్రవర్తన బాగోలేదని, దాని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అన్నారు.

**కాక రేపుతున్న సీపీఐ కామెంట్స్**

'తెలంగాణ క్యాబినెట్ లో మంత్రులకు పూర్తి స్థాయి స్వేచ్ఛ లేదు. దీంతోపనులు జరగడం లేదు. మంత్రులకు వారి శాఖలపై పూర్తి స్థాయి అధికారం, హక్కులతో పనిచేసే కల్పించాలి. వారికి స్వేచ్ఛ ఇవ్వకుంటే కొత్త సమస్యలు తెర మీదకు వస్తాయి. వారికి డబ్బులు విడుదల చేసే హక్కు లేదు. దానికి వారు ఆర్థిక శాఖ చుట్టూ తిరుగుతున్నారు. నా నియోజకవర్గానికి నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు పనులను ఆమోదించినా ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయడం లేదు' అని




కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండున్నరేళ్లుగా ఇదే సాగుతుందని, ఒక్క పని కూడా ముందుకు వెళ్లడం లేదని, నేను కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యేను కాబట్టి నేను ప్రభుత్వాన్ని బలంగా విమర్శంచలేను. అలాగని మౌనంగాను ఉండలేను. మంత్రులు నా సౌమ్యతను తీసుకుని వ్యవహరిస్తున్నారు అని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు పనులు వారి శాఖలకు సంబంధించిన పనులను ఆమోదించినా వాటికి ఆర్థికశాఖ నిధులు మంజూరు చేయక పోవడం మూలంగా పనులు ఆగిపోతున్నాయని ఆయన అంటున్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో సీపీఐ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నియోజకవర్గం నుండి పోటీ చేసి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావు మీద 26 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు 37,555 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితం అయ్యాడు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు మూలంగా మిత్రపక్షంగా ఉన్నప్పటికీ అభివృద్ధి నిధులు, రహదారులు, సింగరేణి ఉద్యోగాలు, భూ సమస్యలు, ఉద్యోగుల డీఏ, ఆర్టీసి వంటి అంశాలలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వానికి బయట నుండి మద్దతు ఇస్తూనే వివిధ సమస్యలపై పార్టీ పరంగా గళం ఎత్తుతూనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష వాదులతో కలిసి పనిచేశారు. 1952లో దేశంలో సీపీఐ సాధారణ ఎన్నికల్లో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. 1964లో కమ్యూనిస్టులు సీపీఐ–సీపీఎంలుగా విడిపోయిన తర్వాత కాంగ్రెస్ పో కలిసి నడిచేందుకు సీపీఐ మొగ్గుచూపింది. 1980, 1985, 1994 ఎన్నికల్లో సీపీఐ టీడీపీతో పొత్తు పెట్టుకుంది. 2004లో సీపీఐ, సీపీఎంలు కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని15 స్థానాల్లో గెలిచాయి. తెలంగాణ – ఆంధ్ర విడిపోయిన తర్వాత వామపక్షాలు రెండు రాష్ట్రాల్లో బలహీనపడ్డాయి.

# బీజేపీ పని షురూ...



హైదరాబాద్, : తెలంగాణాకు చెందిన జి కిషన్ రెడ్డి సీనియర్ నాయకుడు. ఆయన విద్యార్థి రాజకీయాల నుంచి బీజేపీలో పనిచేశారు. ఏబీవీపీ నుంచి యువ మోర్చా దాకా అక్కడ నుంచి బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో పనిచేశారు. ఆయన ఎమ్మెల్యేగా అంబర్ పేట నుంచి మూడు సార్లు గెలిచారు. శాసన సభా పక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. ఇక గత రెండు పర్యాయాలుగా ఆయన ఎంపీగా గెలిచారు. సికింద్రాబాద్ నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రంలో మంత్రిగా ఏడేళ్ళుగా కొనసాగుతున్నారు. తెలంగాణా బీజేపీకి కూడా ఆయన 2023 ఎన్నికలకు ముందు మరోసారి వ్యవహరించారు. ఇంతటి సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్టీ వ్యవహారాలకు పూర్తిగా వాడుకుంటుంది అన్న ప్రచారం సాగుతోంది. బీజేపీ కీలక మార్పులు చేయబోతోంది అని అంటున్నారు. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారం అందుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో బీజేపీ ప్రాతినిధ్యం ఈ రాష్ట్రంలో రెట్టింపు చేయాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం రెండుగా ఉన్న కేంద్ర మంత్రి పదవులను నాలుగు చేయాలని బీజేపీ ఆలోచిస్తో అని అంటున్నారు. అంతే కాదు మహిళ బీసీ కోటాను కూడా అనుసరించి మరిద్దరికి కేంద్ర మంత్రి పదవులు ఇస్తారని అంటున్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర మంత్రిగా చాన్స్ ఖాయమని అంటున్నారు. అలాగే మల్కాజ్ గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి తథ్యమని అంటున్నారు. వీరిద్దరితో పాటు కొందరి సేవలను పార్టీ కోసం వినియోగించుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. ఇక కేంద్ర మంత్రిగా సీనియర్ నేతగా ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అని అంటున్నారు. తెలంగాణా నుంచి దక్షిణాది నుంచి బీజేపీ ఫోకస్ పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. బీజేపీకి పార్లమెంటరీ బోర్డు చాలా కీలకం అని చెబుతున్నారు. ఎవరికి ఎక్కడ టికెట్ ఇవ్వాలన్నా ఈ అత్యున్నత విధాయక మండలి నిర్ణయిస్తుంది. ప్రధాని సహా కీలక నేతలు అంతా ఉండే ఈ బోర్డులోకి కిషన్ రెడ్డిని తీసుకుంటారు అని అంటున్నారు. దాని ద్వారా రానున్న కాలంలో తెలంగాణా రాజకీయాన్ని మరింత క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తారు అని అంటున్నారు. 2028లో జరిగే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలి అన్నది కూడా ఇంకా బాగా అధ్యయనం చేసేందుకు ఇది దోహదపడుతుందని అంటున్నారు. అలాగే సమర్థులకు పనిమంతులకు టికెట్ ఇవ్వడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలిచి తీరాలని బీజేపీ వ్యూహ రచన చేస్తోంది. అంతే కాదు బీజేపీలో ప్రముఖ నేతలలో ఒకరికి గవర్నర్ చాన్స్ కూడా ఇస్తారని అంటున్నారు. దాని వల్ల ఈ ప్రాంతం మీద బీజేపీ మరింతగా శ్రద్ధ చూపిస్తోంది అన్న సందేశం ఇవ్వాలని అనుకుంటోంది. ఇక రానున్న కాలంలో రాజ్యసభ సీటు వంటి పదవులు కూడా తెలంగాణాకు దక్కవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద జాతీయ కార్యవర్గంలో చోటు లేదని భావించే చోట తెలంగాణా నుంచి కిషన్ రెడ్డిని పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అన్న ప్రచారం సాగుతోంది.

# 40 కోట్ల టెండర్ కు రెండున్నర కోట్ల అమ్యామ్యాలు...

హైదరాబాద్, :వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు. ఈ సామెతను గడిచిన కొన్ని సంవత్సరాలుగా మహిళ ఐఏఎస్ అధికారి నిజం చేసి చూపిస్తున్నారు. చూపించడమే కాదు దర్జాగా కోట్లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఇదంతా కూడా వాట్సప్ కాల్ ద్వారా ఆమె చేసి చూపిస్తున్నారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ శాఖలో ఆ మహిళా అధికారి కీలకంగా ఉండేవారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుపొందిన జిల్లాకు కలెక్టర్ గా వ్యవహరించారు. ఆ తర్వాత ఆమె ఒక శాఖలో కీలక అధికారిగా పనిచేస్తున్నారు. ఈ శాఖలో రకరకాల అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటాయి. గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక సంస్థకు ఆమె కాంట్రాక్టు కట్టబెట్టారు. ఏకంగా 40 కోట్ల టెండర్ ఆ సంస్థకు అందే విధంగా చూశారు. అప్పటినుంచి ఆ సంస్థ ఆధిపతులకు.. ఆ మహిళ ఐఏఎస్ అధికారికి ఫెవికాల్ సంబంధం ఏర్పడింది. ఆ అధికారికి.. కంపెనీకి మధ్య వ్యవహారాలు చక్కబెట్టడానికి ఒక ఏడి స్థాయి అధికారి పనిచేసేవారు. గులాబి పార్టీ.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ.. అధికారంలో ఎవరు ఉన్నా సరే ఆ శాఖకు సంబంధించిన కాంట్రాక్ట్ మొత్తం ఆ కంపెనీకి దక్కుతుంది. పైగా ఎటువంటి నిబంధనలు పాటించే అవకాశం లేకుండానే ఆ మహిళా అధికారి ఆ సంస్థకు టెండర్ దక్కే విధంగా చూస్తుంటారు.ప్రభుత్వ మారినప్పటికీ.. అధికారులు మారినప్పటికీ ఆ మహిళ ఐఏఎస్ అధికారి మాత్రం ఆ శాఖలోనే ఉంటారు. పైగా ఆ కంపెనీకి మాత్రమే కాంట్రాక్ట్ దక్కే విధంగా చూస్తుంటారు. ఇలా కాంట్రాక్ట్ దక్కేలా చూసినందుకు ఆ కంపెనీ ఆ మహిళా అధికారికి ఏకంగా 2.5 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. రెండు విడతలుగా అది కూడా నగదు రూపంలో ఆ మహిళ అధికారికి ఆ కంపెనీ నిర్వాహకులు ఇచ్చినట్టు సమాచారం. అయితే ఇదంతా కూడా కేవలం వాట్సాప్ కాల్ ద్వారా జరిగిపోవడం మరింత విశేషం. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ. ఆ మహిళా అధికారి ఆ శాఖలో ఉంటుంటారు. ఆమెను బదిలీ చేసే సాహసం ఏ ప్రభుత్వం కూడా చేయదు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అవినీతిని రూపుమాపడానికి ప్రయత్నాలు చేస్తోంది. అవినీతి అధికారులను అరెస్ట్ చేయిస్తుంది. వారి ఆస్తులను బయటపెడుతున్నది. అక్రమంగా సంపాదించిన ఆస్తులను స్వాధీనం చేసుకుంటున్నది. అయినప్పటికీ ఇటువంటి మహిళా అధికారులు ఏమాత్రం భయం లేకుండా సంపాదిస్తున్నారు అంటే వారి వెనుక బలమైన అండ ఉందని అర్థం. మరి ఇటువంటి అండలను ఏ విధంగా తొలగిస్తారు.. అవినీతి అధికారులను ఏ విధంగా శిక్షిస్తారు అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.

## వేప ఆకుల నమలితే శరీరంలో జరిగే మార్పు ఇదే!



కొన్ని మూలికలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒకేసారి ఎన్నోరకాల వ్యాధులకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. వేప అటువంటి ఆయుర్వేద మూలికలలో ఒకటి. ఇది చర్మం నుండి శరీరం వరకు అనేక ముఖ్యమైన అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం, ఎండాకాలంలో వేప పువ్వులు తినడం వల్ల శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఈ పువ్వులు పిత్తను శాంతపరుస్తాయని చెబుతారు. ఈ కారణంగా, దక్షిణ భారతదేశంలో వేసవి ప్రారంభంలో వీటిని తింటారు. వేపలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, ఇమ్యునోమోడ్యులేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ మూలిక రక్తాన్ని శుద్ధి చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చర్మ ఛాయను మెరుగుపరుస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల కురుపులు, రింగ్వా, దురద వంటి చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

వేపను చేదుగా భావిస్తారు. కానీ, ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరమైన ఔషధంగా భావిస్తారు. ఖాళీ కడుపుతో వేప ఆకులను నమలడం ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వేప ఆకులను నమలడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది. చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఇది నోటి కుహరంలోని బ్యాక్టీరియాను చంపి దంతాలు, చిగుళ్ళను బలపరుస్తుంది. వేప తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, ఆమ్లత్వం తగ్గుతుంది. డయాబెటిస్‌లో రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ఇది సహాయకరంగా పరిగణించబడుతుంది. వేప ఆకులు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం శరీరాన్ని లోపలి నుండి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. వేప ఆకులను తినడం వల్ల రక్తంలో చక్కెర, రక్తపోటు, కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆయుర్వేదంలో వేప ఆకులు, పువ్వుల రసం లేదా కషాయాన్ని రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి, శరీరాన్ని శుభ్రపరచడానికి క్రమం తప్పకుండా తీసుకుంటారు. వేపను మాత్రమే కాకుండా కలకండతో కలిపి కూడా తీసుకోవడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఈ రెండు పదార్థాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. వేడి సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. అంతర్గత బలహీనతను తగ్గిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది.

## టీ తాగేటప్పుడు ఈ పొరపాట్లు చేస్తున్నారా?



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాల్లో టీ (తేనీరు) ఒకటి. ముఖ్యంగా భారతదేశంలో చాలా మంది ఉదయాన్నే ఒక కప్పు టీతో రోజును ప్రారంభిస్తారు. శరీరానికి ఉత్సాహాన్ని, మనసుకు చైతన్యాన్ని అందించే టీ ఆరోగ్యానికి కూడా కొన్ని ప్రయోజనాలను అందిస్తుంది. అయితే టీ తయారుచేసే విధానం లేదా తాగే సమయంలో చేసే కొన్ని పొరపాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టీ అంటే చాలా మందికి అమితమైన ఇష్టం. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక కప్పు వేడి టీ తాగితేనే రోజు ప్రారంభమైన భావన కలుగుతుంది. శరీరానికి, మనసుకు ఉత్సాహాన్ని అందించే ఈ పానీయం మన దైనందిన జీవితంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అయితే టీ తయారీ లేదా టీ తాగే సమయంలో చేసే కొన్ని సాధారణ పొరపాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మందికి ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో టీ తాగే అలవాటు ఉంటుంది. అయితే ఇలా చేయడం వల్ల టీలోని ఆమ్ల పదార్థాలు కడుపు లోపలి పొరను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో గుండెల్లో మంట, అజీర్ణం, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ఉదయం ముందుగా ఒక గ్లాసు నీరు లేదా జీలకర్ర కలిపిన గోరువెచ్చని నీరు తాగి, అల్పాహారం తర్వాత టీ తీసుకోవడం మంచిది. టీ రుచి బాగా రావాలనే ఉద్దేశంతో కొందరు టీ పొడిని ఎక్కువసేపు నీటిలో మరిగిస్తుంటారు. కానీ ఇలా చేయడం వల్ల 'టానిన్' అనే పదార్థం అధికంగా విడుదలై టీ చేదుగా మారుతుంది. అంతేకాకుండా కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు కూడా కారణమవుతుంది. అలాగే టీని వడకట్టేందుకు చాలామంది ప్లాస్టిక్ జల్లెడలను ఉపయోగిస్తుంటారు. అయితే వేడి టీతో ప్లాస్టిక్‌లోని కొన్ని రసాయనాలు కలిసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఇవి ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల ప్లాస్టిక్ జల్లెడల బదులుగా స్టీల్ జల్లెడలను ఉపయోగించడం ఉత్తమం. ఒకసారి తయారైన టీని పదేపదే వేడి చేసి తాగడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయడం వల్ల టీలోని రసాయనిక లక్షణాలు మారి ఆమ్లత్వం పెరగవచ్చు.

## రోగనిరోధక శక్తిని పెంచే ఫ్రూట్స్..



వర్షాకాలం రాగానే వాతావరణం చల్లబడి ఎంతో ఆహ్లాదకరంగా మారుతుంది. కానీ, ఇదే సమయంలో గాలిలో మరియు నీటిలో బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోతుంది. వానాకాలంలో మన శరీరంలో రోగనిరోధక శక్తి సహజంగానే కాస్త మందగిస్తుంది. దీనివల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు మనల్ని సులభంగా అటాక్ చేస్తూ ఉంటాయి. ప్రకృతి మనకు ఆయా సీజన్లలో వచ్చే వ్యాధుల నుండి తట్టుకోవడానికి వీలుగా కొన్ని ప్రత్యేకమైన పండ్లను ప్రసాదించింది. వర్షాకాలంలో లభించే కొన్ని రకాల పండ్లను రోజూ తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. మరి ఈ మాన్సూన్ సీజన్‌లో మనం ఖచ్చితంగా తినాల్సిన ఆ ఆరోగ్యకరమైన పండ్లు ఏంటో, వాటి వల్ల కలిగే లాభాలేంటో ఇప్పుడు పూర్తి వివరంగా తెలుసుకుందాం.


వర్షాకాలంలో లభించే అత్యంత పవర్‌ఫుల్ పండు నేరేడు. ఇందులో ఐరన్, ఫోలేట్, పొటాషియం మరియు విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తహీనతను తగ్గించడమే కాకుండా, వర్షాకాలంలో వచ్చే పొట్ట ఇన్ఫెక్షన్లు మరియు డయేరియా సమస్యలను నివారిస్తుంది.

## జాజికాయ నీరులో అద్భుతమైన ప్రయోజనాలు!



మన వంటగదిలో ఉండే సుగంధ ద్రవ్యాలు కేవలం ఆహారానికి రుచి, సువాసనను అందించడానికే కాకుండా, ఆరోగ్యానికి పట్టుకొమ్మలుగా పనిచేస్తాయి. భారతీయ సాంప్రదాయ వైద్య విధానమైన ఆయుర్వేదంలో శతాబ్దాలుగా అనేక తీవ్రమైన వ్యాధుల నివారణకు ఈ ద్రవ్యాలను ఉపయోగిస్తున్నారు. జాజికాయ నీటిని అంటే జాజికాయ పొడి కలిపిన నీరు తీసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం అద్భుతంగా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పోషకాల గని – జాజికాయ: జాజికాయలో సహజసిద్ధమైన యాంటీ బయోటిక్ గుణాలు ఉంటాయి. ఇందులో శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, కాపర్ వంటి ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇన్ని పోషకాలున్న ఈ నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు. జీర్ణ సమస్యలకు శాశ్వత పరిష్కారం: జాజికాయలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కడుపు ఇన్ఫెక్షన్లను దూరం చేస్తాయి. జీర్ణక్రియను వేగవంతం చేసి, నేటి కాలంలో చాలామందిని వేధించే మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి.


## గుండెపోటుకు చెక్ పెట్టే ఈ ఫుడ్ ఐటమ్స్ గురించి మీకు తెలుసా..?



ఈ మధ్యకాలంలో గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నాపెద్దా, ఆడామగ తేడా లేకుండా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయి. నిత్యం కసరత్తులు చేసి ఫిట్‌గా ఉండే క్రీడాకారులు, ఎలాంటి గుండె జబ్బుల ఆనవాళ్లు లేని ఆరోగ్యవంతులు కూడా అకస్మాత్తుగా వచ్చే హార్ట్ ఎటాక్‌లతో, కార్డియక్ అరెస్ట్‌లతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఆకస్మిక గుండె రుగ్మతలకు చెక్‌పెట్టేందుకు కొన్ని ఆహార పదార్థాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమమైన ఆహార పదార్థాలు చేపలు, గుడ్లు. ఈ రెండింటిలోనూ ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. మీరు శాఖాహారులైతే చేపలు, గుడ్లకు బదులుగా డ్రై ఫ్రూట్స్ తినవచ్చు. డ్రై ఫ్రూట్స్‌లో కూడా ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులను నివారిస్తాయి. పప్పుధాన్యాలు, బీన్స్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి శరీరానికి పుష్కలంగా ప్రొటీన్‌ను అందించడంతోపాటు గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడుతాయి. అదేవిధంగా సిట్రస్ జాతి పండ్లలో కూడా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే అనేక పోషకాలు ఉంటాయి. సిట్రస్ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దాంతో ఆకస్మిక గుండెపోట్లు, కార్డియాక్ అరెస్ట్‌ల వంటివి జరగకుండా ఉంటాయి.

## తాజా పదార్థాలతో ఆరోగ్యం...



శీతాకాలం ముగిసి ఎండలు రోజురోజుకూ పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో తినే ఆహారంతోపాటుగా తాగే మంచి నీరు కూడా తాజాగా ఉంచేలా చూసుకోవాలి. కల్తీ, కలుషిత ఆహార పదార్థాలు అనారోగ్యానికి గురిచేస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ తినే ఆహారం విషయంలో ప్రొటీన్లు, విటమిన్లు, కేలరీలు ఉండేలా చూసుకోవాలి.మనం తినే ఆహారం మంచిగా ఉంటే ఆరోగ్యం మన సొంతమవుతుంది. అలాకాకుండా కుళ్లిపోయిన, పాచిపోయిన ఆహారాలను తీసుకుంటే అనారోగ్యం పాలౌతాము. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లో కూడా కలుషిత, కల్తీ ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు. అయితే ఏది మంచి ఆహారం? ఏది కల్తీ ఆహారం? అనే విషయాలపై కాస్త అవగాహన ఉండటం మేలు. తద్వారా మంచి ఆహార పదార్థాలను తీసుకోవచ్చు. తాజాగా వండిన ఆహార పదార్థాలు ఎంతో మేలు..అలాగే తాజాగా ఉండే కూరగాయలు, ఆకుకూరలు వంటివి వండి తింటే మంచిగా ఆరోగ్యంగా ఉండొచ్చు.

స్ట్రీట్‌ఫుడ్ వద్దే వద్దు : ఎప్పుడైనా ఒకటి రెండు సార్లు మినహా పదే పదే స్ట్రీట్ ఫుడ్స్ తీసుకోవటం ఏమంత మంచిది కాదు. ఇంట్లో వాళ్లు ఏదో పనిలో బిజీగా ఉండి వంటలు చేయనప్పుడు, లేదా ఇతర ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లినప్పుడో ఇలా కొన్ని సందర్భాల్లో మినహా అదేపనిగా బయట స్ట్రీట్‌ఫుడ్ తింటే అనారోగ్యాన్ని చేజేతులా కొని తెచ్చుకున్నట్లే. చాలామంది ఆకలేసినప్పుడు కడుపు నింపుకోవటానికి కనబడిన స్నాక్స్‌ను లాగించేస్తుంటాం. అందులోనూ ప్రాసెసింగ్ చేసిన ఆహారాన్ని, వేపుళ్లను (ఫ్రెంచ్ ఫ్రైస్, నూడీల్స్) లాంటివి తింటుంటాం. ఇలాంటి ఆహారాల్లో ఎక్కువగా ఉప్పు, చక్కెర ఎక్కువగా వాడేస్తుంటారు. అందువల్ల వీటిని ఎక్కువగా తినకూడదు. వీటికి ప్రత్యామ్నాయంగా తాజాపండ్లు వంటివి తీసుకోవటం ఆరోగ్యానికి ఎంతో మేలు. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం పూట ఆకలేసినప్పుడు ఆ సమయంలో స్నాక్స్ తినాలని భావించినప్పుడు ఏదో ఒక పండును తింటుంటాం. అది చాలకపోయిన సందర్భాల్లో ఇంకా చిప్స్, బిస్కెట్లు, కేకులు, మిర్చి బజ్జీలు, ఉప్పు కలిపిన పదార్థాలు లాంటివి అమాంతం తినేస్తుంటాం. అలాంటప్పుడే ఒక్క నిముషం ఆలోచించి వీటికి బదులుగా పండుతోపాటు బాదంపప్పు, పిస్తా పప్పు, జీడిపప్పు, వాల్‌నట్స్ లాంటివి తీసుకుంటే శరీరానికి ప్రొటీన్లు, మంచి కొవ్వులు లభించి అదనపు శక్తినిస్తాయి. ఉదాహరణకు ఒక జామ పండుతోపాటు మరికొన్ని వాల్‌నట్స్ వంటివి తీసుకోవచ్చు.

రోగ నిరోధకశక్తిని పెంచే తాజాపండ్లు : ప్రతి ఒక్కరూ తమ శరీరానికి రోగాల నుంచి కాపాడుకునే శక్తిని పెంపొందించుకోవాలి. దానికి అవసరమైన పండ్లను గుర్తించి తినటం ఎంతో మేలు. శరీరానికి పండ్లు ఎంతో శక్తిని అందిస్తాయి. తాజా పండ్లలో రకరకాల పోషకాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా లభిస్తాయి. బొప్పాయి, అరటి, మామిడి, జామ, సీతాఫలం, లేత పసుపు రంగు గల పండ్లలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకోవటం ద్వారా రోగ నిరోధక శక్తి బలోపేతమవుతుంది. బత్తాయి, నారింజ వంటి పండ్లను తీసుకుంటే జలుబు చేస్తుందనే భావన చాలా మందిలో ఉంటుంది. కానీ అది నిజం కాదని వైద్య నిపుణులు ఎప్పుడో ధృవీకరించారు.

అదనపు శక్తికి మొలకెత్తిన విత్తనాలు : వివిధ పండ్లతోపాటుగా మొలకెత్తిన గింజలు తిన్నా శరీరానికి అదనపు శక్తి చేకూరుతుంది. శాకాహారం తినేవారిలో బీ 12 లోపం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు ఉసిరి, క్యారెట్, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్‌ను తీసుకుంటే అనేక రకాల పోషకాలు శరీరానికి లభిస్తాయి. జ్యూస్‌లు కూడా తీసుకోవచ్చు.

జబ్బుల నుంచి కాపాడే ఆకుకూరలు, కూరగాయలు : పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు, పప్పులతోపాటుగా బాదం, జీడిపప్పు వంటి గింజపప్పులు (నట్స్), ఖర్జూరం, కిస్‌మిస్, అంజీరా వంటి ఎండు ఫలాల్లోనూ పోషకాహారం ఉంటుంది. మేలిరకం కొవ్వులు, విటమిన్లతోపాటు ఫాస్ఫరస్, రాగి, ఇనుము, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఎండుపండ్లలో దండిగా ఉంటాయి. ఇవన్నీ కీలకమైన అవయవాలు సరిగా పనిచేసేలా కాపాడతాయి. రకరకాల జబ్బుల భారినపడకుండా కాపాడతాయి.

కేలరీలు పెంపొందించే ఫైబర్, ప్రొటీన్లు : తాజాపండ్లు, పోషకాలు, విటమిన్లతోపాటుగా మొలకెత్తిన విత్తనాలు, ఫైబర్, ప్రొటీన్లు కూడా శరీరానికి అవసరమే. శరీరానికి శక్తి కావాలంటే నిర్ధిష్ట మొత్తంలో కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. స్థూలకాయం ఉన్నవారు తక్కువగానూ, తక్కువ బరువున్న వారు ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రస్తుత జీవనశైలి ప్రకారం ప్రతిరోజూ 1600 నుంచి 1800 కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకుంటే సరిపోతుంది. తాజాపండ్లతోపాటు డ్రైఫ్రూట్స్, పెరుగు పదార్థాలను తీసుకుంటే శరీరానికి ఫైబర్, ప్రొటీన్లతోపాటు మంచి కేలరీలు అందుతాయి. చిన్నపిల్లలు, గర్భవతులు, పాలిచ్చే తల్లులు, గర్భవతులకు పోషకాలు ఎక్కువగా కావాలి. అందువల్ల వారి ఆహారంలో ఎక్కువ కేలరీలు ఉండేలాచూసుకోవాలి. వారుఎక్కువగా పండ్లు, పాలు, డ్రైఫ్రూట్స్ వంటివి తీసుకోవాలి.మధుమేహం ఉన్న వారికిసరిపడా కేలరీలుఉన్న ఆహారమే ఇవ్వాలి. టీబీ ఉన్న వారు అత్యధిక కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రతిఒక్కరూ తాము చేసే పనినిబట్టి, శ్రమను బట్టి కూడా కేలరీల అవసరం మారుతుంటుంది. ఎక్కువగా పనిచేసే వారు ప్రతిరోజూ 2200 కేలరీల ఆహారం తీసుకోవచ్చు. శరీరానికి సరిపడా శక్తి కావాలంటే తినే ఆహారంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు సమపాళ్లలో ఉండేలా చూసుకోవాలి.

## కాలానికి తగ్గట్టే..

ఆహార అలవాట్లను కూడా.. కాలానికి తగ్గట్టుగా మార్చుకోవాలి. ఇష్టమైన వంటకమైనా.. సీజన్‌కు సెట్‌కాకుంటే పక్కన పెట్టేయాలి. లేదంటే, ఆరోగ్యానికి హాని కలుగుతుంది. ముఖ్యంగా, వేసవిలో కొన్ని కూరగాయలతో అనారోగ్యం పొంచి ఉంటుంది. కాబట్టి, ఎండకాలంలో ఏయే కూరగాయలు, వంటకాలు తినకూడదో తెలుసుకుంటే మంచిది. వంకాయ.. కూరగాయల్లో రారాజుగా పేరు. కానీ, వేసవిలో మాత్రం ఆరోగ్యానికి శత్రువు. వంకాయను వేడి కూరగాయగా చెబుతారు నిపుణులు. వేసవిలో దీన్ని తినడం వల్ల జీర్ణవ్యవస్థను బలహీనపరుస్తుంది. మలబద్ధకం, గ్యాస్ వంటి పొట్ట సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కొందరిలో అలెర్జీలు కూడా రావొచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలుచేసే కాలీఫ్లవర్.. ఎండల్లో శరీరానికి హాని కలిగిస్తుంది. ఇందులో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది శరీరంలో వేడిని పెంచుతుంది. ఎసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలకూ దారితీస్తుంది.

మూత్రపిండాల సమస్యలు, రక్తంలో చక్కెర స్థాయులు తక్కువగా ఉన్నవారు వేసవిలో చేమదుంపలను తినకూడదని నిపుణులు చెబుతు న్నారు. వీటిలో ఆగ్జాలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది మూత్రపిండాల పని తీరుపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, వేసవిలో డీహైడ్రేషన్ వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. అలాంటి కాలంలో చేమదుంపలు తింటే..

కిడ్నీలకు మరింత హాని కలుగుతుంది.

మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. దాంతో, జీర్ణవ్యవస్థపై అధిక ఒత్తిడి పడుతుంది. ఇక శరీరం వేడిగా ఉండే వేసవిలో మటన్ వంటకాలు తింటే.. శరీర ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుంది. కాబట్టి, వేసవిలో మాంసాహారాన్ని తగ్గించుకోవడం మంచిది.ఇక వేడివేడి కాఫీలు, టీలనుకూడా తగ్గించాలి. ఇవి శరీర ఉష్ణోగ్రతను అమాంతం పెంచేసి, మరింత అసౌకర్యాన్ని కలిగిస్తాయి. వీటికి బదులుగా మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లను ఎంచుకుంటే బెటర్! వేసవి అంటేనే.. పచ్చళ్ల సీజన్. ముఖ్యంగా ప్రతి ఇంట్లోనూ మామిడికాయలతో పచ్చళ్లు పెట్టుకుంటారు. కానీ, ఈ కాలంలో వీటికి దూరంగా ఉండటమే మంచిది. పచ్చళ్లలో ఉప్పు,నూనె అధికంగా వాడతారు. ఉప్పు అధికంగా తీసుకుంటే.. శరీరం త్వరగా నీటిని కోల్పోతుంది. ఇది డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక, అధిక నూనె కూడా వేసవిలో అనారోగ్యానికి కారణమవుతుంది.




# డేటా సెంటర్ల ప్రయోజనాలు పరిమితం...

దేశంలో డేటా సెంటర్ల కోసం బిలియన్ల డాలర్ల పెట్టుబడులు వెల్లువెత్తుతున్నా.. ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రత్యక్ష ప్రభావం మాత్రం పరిమితంగానే ఉండనుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ రేటింగ్స్ తెలిపింది. గూగుల్, అదానీ, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు సుమారు 250 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 23.6 లక్షల కోట్లు) పెట్టుబడులను ప్రకటించాయి. విదేశీ క్లౌడ్ సంస్థలను ఆకర్షించేందుకు ప్రభుత్వం కూడా 2047 వరకు పన్ను మినహాయింపులు ఇచ్చింది. విశాఖపట్నంలో గూగుల్-అదానీల రూ. 1.4 లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ దీనికి ఒక పెద్ద ఉదాహరణ. అయితే, ఇంత భారీగా నిధులు వస్తున్నప్పటికీ, మన జీడీపీకి వీటి ద్వారా వచ్చే లాభం చాలా తక్కువని మూడీస్ తన నివేదికలో స్పష్టం చేసింది. 2030 నాటికి దేశ జీడీపీలో ఈ డేటా సెంటర్ల వాటా కేవలం 0.13 శాతం మాత్రమే ఉంటుందని అంచనా వేసింది. డేటా సెంటర్లకు వేల కోట్లు ఖర్చవుతున్నా, స్థానికంగా జరిగే రాబడి (వాల్యూ అడిషన్) మాత్రం తక్కువే. ఎందుకంటే వీటి తయారీకి కావలసిన సర్వర్లు, సెమీకండక్టర్లు, కూలింగ్ సిస్టమ్‌లు, ప్రత్యేక ఐటీ పరికరాలన్నింటినీ విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా, ఉద్యోగాల కల్పన విషయంలోనూ ఇవి పెద్దగా ప్రభావం చూపలేవు. మూడీస్ అంచనాల ప్రకారం, 2025 నాటికి నిర్మాణ రంగంలో లభించే ఉద్యోగాలు 0.01 శాతం మాత్రమే. డేటా సెంటర్లు పూర్తిగా అందుబాటులోకి వచ్చాక కూడా 0.02 శాతం ఉద్యోగాలు మాత్రమే వస్తాయి. అవి కూడా కేవలం అత్యంత సాంకేతిక నైపుణ్యం ఉన్న కొద్దిమందికే పరిమితమవుతాయి.

చాలామంది భావిస్తున్నట్లుగా డేటా సెంటర్ల వల్ల దేశంలో విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం లేదు. 2030 నాటికి దేశ మొత్తం విద్యుత్ డిమాండ్‌లో ఇవి వాడేది 5 శాతం కంటే తక్కువే. అయితే, ఈ పెట్టుబడులు వ్యూహాత్మకంగా ముఖ్యమైనవే అయినప్పటికీ, దేశ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను ఒక్కసారిగా మార్చలేవు. మన దేశీయ సరఫరాదారులను ప్రోత్సహించడం, డిజిటల్ సేవల ఎగుమతులు పెంచడం, క్లౌడ్ వినియోగాన్ని విస్తరించడం ద్వారానే ఈ డేటా సెంటర్ల వల్ల పరోక్షంగా నిజమైన ఆర్థిక ప్రయోజనం ఉంటుందని నివేదిక పేర్కొంది.



# చిప్స్ తయారు చేయడం ఎందుకు?వాటిని స్మగుల్ చేయొచ్చుగా




దేశీయంగానే సొంతంగా సెమీకండక్టర్ల (చిప్‌లు) తయారీకి ప్రభుత్వం 'సెమికాన్ ఇండియా' పథకాల ద్వారా లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. అయితే, ఈ భారీ వ్యయాన్ని ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఎకనామిస్టు రఘురామ్ రాజన్ తీవ్రంగా తప్పుపట్టారు. 'చిప్‌లు సైజులో చాలా చిన్నవి, ప్రపంచంలోనే అత్యంత సులభంగా స్మగ్లింగ్ చేయగల వస్తువులు అవే. చైనా, రష్యాలు కూడా ఆంక్షల వేళ స్మగ్లింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అలాంటప్పుడు బిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టి దేశీయంగా తయారు చేయడం ఎందుకు?

దానికి బదులు విద్య, వైద్యం, మెరుగైన వ్యాపార వాతావరణం వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలపై ఫోకస్ పెట్టవచ్చు కదా' అని ఆయన వ్యాఖ్యానించారు. అవసరమైతే విదేశాల్లో ఉన్న 3.5 కోట్ల మంది ప్రవాస భారతీయులే మనకు చిప్‌లు కొని పంపుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర దుమారాన్ని రేపాయి. 'రేపు కార్లు, రాకెట్లను కూడా స్మగ్లింగ్ చేయమంటారా?' అని నెటిజన్లు ఆయనను ట్రోల్ చేస్తున్నారు.

రాజన్ వాదన ఎలా ఉన్నప్పటికీ, సెమీకండక్టర్ల తయారీ అనేది కేవలం వ్యాపారం మాత్రమే కాదు, దేశ భద్రతకు సంబంధించిన కీలక అంశం. స్మార్ట్‌ఫోన్ల నుంచి యుద్ధ విమానాల వరకు ప్రతిదానికీ చిప్‌లే ప్రాణం. 2021లో చిప్‌ల కొరత వల్ల మారుతీ సుజుకి వంటి దిగ్గజ కంపెనీల కార్ల ఉత్పత్తి ఏకంగా 60 శాతం పడిపోయింది. పైగా తైవాన్, అమెరికా వంటి కొన్ని దేశాల చేతిలోనే ఉన్న ఈ సాంకేతికతను యుద్ధం లేదా సంక్షోభ సమయాల్లో వేరే దేశాలకు సులభంగా నిలిపివేయవచ్చు. రష్యా, చైనాలు స్మగ్లింగ్ చేస్తున్నది డబ్బు ఆదా చేసుకోవడానికి కాదు, పాశ్చాత్య దేశాల ఆంక్షల వల్ల వేరే దారి లేక. సొంతంగా తయారీ సామర్థ్యం లేకపోతే ఏ క్షణంలోనైనా దేశ డిజిటల్, రక్షణ రంగాలు స్తంభించిపోతాయి. అందుకే టాటా, మైక్రాన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో రూ. 1.64 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తూ, 2026, జూలై నాటికే మూడు ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చి భారత్ తన వ్యూహాత్మక స్వయంసమృద్ధి వైపు వేగంగా అడుగులేస్తోంది.

# ఫోక్స్‌వ్యాగన్‌లో లక్ష ఉద్యోగాలకు ఎసరు..




ప్రపంచ ఆటోమొబైల్ రంగంలో ఫోక్స్‌వ్యాగన్ భారీ ఉద్వాసనలకు తెరలేపింది. గ్లోబల్ ఆటో చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా తన మొత్తం ఉద్యోగుల్లో లక్ష మందిని ఇంటికి పంపించాలని నిర్ణయించింది. ఇది ఆ కంపెనీ మొత్తం సిబ్బందిలో 15 శాతానికి సమానం కావడం ఆందోళకరం. ఈ ఏడాది మార్చిలో 50,000 ఉద్యోగాల కోతను ప్రకటించగా.. తాజాగా మరో 50,000 ఉద్యోగులను తొలగించే ప్రణాళికకు ఆ సంస్థ బోర్డు గురువారం ఆమోదం తెలిపింది. దీంతో మొత్తం 1,00,000 మంది సిబ్బందికి ఎసరు పెట్టనుంది. జర్మనీలో ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్‌లో 2023లో 275,000 మంది ఉండగా, 2026 జూన్ 30 నాటికి ఆ సంఖ్య 254,000 కు పడిపోయింది. తాజా చర్యలతో మరింత వేలాది మంది బతుకుదెరువును కోల్పోనున్నారు. అంతర్జాతీయ ప్రక్షాళనలో భాగంగా భారత్‌లోనూ ఉద్వాసనలకు సిద్ధం అయ్యింది. ఇక్కడి యూనిట్ అయిన స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో సుమారు 12 శాతం మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. భారత్‌లో ఈ గ్రూప్‌లో దాదాపు 9వేల మంది వరకు పని చేస్తోన్నారని సమాచారం.

తాజా చర్యలతో దాదాపు 1000 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారని స్పష్టమవుతోంది. వచ్చే మూడేళ్లలో ఖర్చులను భారీగా తగ్గించుకునే లక్ష్యంతో ఈ కోతలు చోటు చేసుకోనున్నాయి. భారత కార్యకలాపాలలో కోట్లాది డాలర్ల రెవెన్యూను ఆదా చేసుకోవడమే ఆ కంపెనీ ప్రధాన ఉద్దేశంగా పెట్టుకుంది. కాగా.. ఉద్యోగుల తొలగింపు సంఖ్యపై వస్తున్న ఊహాగానాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయబోమని స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ పీయూష్ అరోరా తెలిపారు. భవిష్యత్తులో దేశీయ ఇంజనీరింగ్ బృందాన్ని విస్తరించడంతో పాటు, భారత్‌ను ఫోక్స్‌వాగన్ గ్రూప్ తరఫున ఒక కీలక తయారీ, ఇంజనీరింగ్, ఎగుమతి కేంద్రంగా మార్చేందుకు పెట్టుబడులను మరింతగా పెంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు భారత్‌లో తమ వ్యాపార యాజమాన్య విధానంలోనూ మార్పులు తెచ్చే దిశగా బిలియనీర్ సజ్జన్ జిందాల్‌కు చెందిన జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌తో చర్చలు జరుపుతుండటం గమనార్హం.

# మరోసారి బంగారం ధరల పతనం...



హైదరాబాద్‌లో బంగారం ధరలు తగ్గాయి. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,41,900గా ఉంది. ఇది రూ.1,700 తగ్గింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,800గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే రూ.1,860 తగ్గింది. మరోవైపు హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,54,900గా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1,42,050గా, 24 క్యారెట్ల బంగారం రూ.1,54,950గా ఉంది. రెండు రకాల బంగారం ధరలు వరుసగా రూ.1,700, రూ.1,860 తగ్గాయి. ముంబై, కోల్‌కతాలో 22 క్యారెట్ల బంగారం రూ.1,41,900, 24 క్యారెట్ల బంగారం రూ.1,54,800గా ఉంది. ఈ రెండు నగరాల్లోనూ ఇదే స్థాయిలో ధరలు తగ్గాయి. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,050.. 24 క్యారెట్ల ధర రూ.1,54,950.. కిలో వెండి ధర రూ. 2,50,000. ముంబైలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,41,900.. 24 క్యారెట్ల ధర రూ.1,54,800.. కిలో వెండి ధర రూ.2,50,000. కోల్‌కతాలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,41,900.. 24 క్యారెట్ల ధర రూ.1,54,800? కిలో వెండి ధర రూ.2,50,000. హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగరం ధర రూ.1,41,900.. 24 క్యారెట్ల ధర రూ.1,54,800.. కిలో వెండి ధర రూ.2,54,900. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. గత కొన్ని వారాలుగా పెళ్లిళ్ల సీజన్‌లోనూ బంగారం ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1.40 లక్షలు, 22 క్యారెట్ల బంగారం రూ.1.50 లక్షల స్థాయిలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. అయితే, ఇక్కడ పేర్కొన్న ధరలు ఉదయం 8 గంటల సమయానికి సంబంధించిన రేట్లు. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డిమాండ్, సరఫరా వంటి అంశాల ఆధారంగా బంగారం, వెండి ధరలు రోజులో ఎప్పుడైనా మారే అవకాశం ఉంది. అందువల్ల కొనుగోలుదారులు నగలు లేదా బంగారం కొనుగోలు చేసే ముందు తాజా లైవ్ రేట్లను తప్పనిసరిగా పరిశీలించడం మంచిది.అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. గత కొన్ని వారాలుగా పెళ్లిళ్ల సీజన్‌లోనూ బంగారం ధరల్లో తగ్గుదల కనిపిస్తోంది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు సుమారు రూ.1.40 లక్షలు, 22 క్యారెట్ల బంగారం రూ.1.50 లక్షల స్థాయిలో హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. పేర్కొన్న ధరలు మునుపటి రోజు క్లోజింగ్ రేట్ల ఆధారంగా ఉండగా, కొత్త రోజు ధరలు పెరుగుదల లేదా తగ్గుదలతో ప్రారంభం కావచ్చు.

# బ్యాంకుల్లో భారీగా నగదుఆర్‌బిఐ కీలక చర్యలు...

దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు స్థాయిలు అత్యధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బిఐ) ఈ మిగులు నగదును నియంత్రించేందుకు కీలక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. సోమవారం, రూ.ఏడు లక్షల కోట్లను 30 రోజుల పాటు బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి వెనక్కి తీసుకునేందుకు 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' వేలం నిర్వహించనుంది. ఈ ప్రకటన ఆర్‌బిఐ అధికారికంగా విడుదల చేసింది. గతంలో నిర్వహించిన లిక్విడిటీ ఆపరేషన్లతో పోలిస్తే, ఇది ఎక్కువ కాలం ఉండే చర్యగా భావించబడుతోంది. గతంలో గరిష్ఠంగా 15 రోజుల వరకు మాత్రమే మిగులు నగదును తీసుకునేలా వేలం నిర్వహించబడింది. కానీ, ఇప్పుడు 30 రోజుల పాటు నిధులను ఆర్‌బిఐ వద్ద ఉంచే అవకాశం ఉంది. దీంతో స్వల్పకాలిక మనీ మార్కెట్‌పై కేంద్ర బ్యాంకుకు మరింత నియంత్రణ లభించనుంది. ప్రస్తుతం దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో దాదాపు రూ.10.5 లక్షల కోట్ల మిగులు నగదు ఉన్నట్లు అంచనా వేయబడింది. ఈ పరిస్థితి, విదేశాల్లో ఉన్న భారతీయులు బ్యాంకుల్లో భారీగా డాలర్ డిపాజిట్లు చేయడంతో ఏర్పడింది. ఆ విదేశీ కరెన్సీని ఆర్‌బీఐ రూపాయల్లోకి మార్చడం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో పెద్ద మొత్తంలో నగదు ప్రవేశించింది. విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి డాలర్ డిపాజిట్లను ఆకర్షించేందుకు ఆర్‌బిఐ తీసుకొచ్చిన పథకం అత్యంత విజయవంతంగా కొనసాగుతోంది. ఆగస్టులో ఈ పథకం ముగిసే సమయానికి రికార్డు స్థాయిలో 127 బిలియన్ డాలర్లు సమీకరించారు. ఈ పథకాన్ని నిర్ణీత గడువు కంటే నెల ముందుగానే ముగించారు. బ్యాంకులు మరియు ప్రభుత్వ రంగ సంస్థలకు కల్పించిన ఇతర రుణ సదుపాయాలతో కలిపి ఆర్థిక వ్యవస్థలోకి దాదాపు 136.4 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఈ భారీ నగదు ప్రవాహం వల్ల బ్యాంకుల మధ్య




రాత్రికి రాత్రి జరిగే రుణాల వడ్డీ రేట్లు కూడా తగ్గుతున్నాయి. ప్రస్తుతం వెయిటెడ్ యావరేజ్ కాల్ రేట్ ఆర్‌బీఐ పాలసీ రేటు కంటే దిగువకు చేరింది. ఈ పరిస్థితి, ఆర్థిక వ్యవస్థలో మిగులు నగదును క్రమంగా వెనక్కి తీసుకుంటూ మార్కెట్లపై ప్రభావం పడకుండా చూడటం ఆర్‌బీఐకి ప్రధాన సవాలుగా మారింది.

ఈ చర్యలు, దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు, బ్యాంకింగ్ వ్యవస్థలోని లిక్విడిటీని సమర్థంగా నిర్వహించేందుకు ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలలో భాగంగా ఉన్నాయి. ఈ విధంగా, ఆర్బిఐ తీసుకునే చర్యలు, దేశ ఆర్థిక వ్యవస్థకు, బ్యాంకింగ్ వ్యవస్థకు ఎంత ముఖ్యమైనవి అనేది స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు నగదు నియంత్రణకు తీసుకుంటున్న ఈ చర్యలు, దేశంలో ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఆర్‌బిఐ ఈ చర్యల ద్వారా, దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలంగా చేయడానికి ప్రయత్నిస్తోంది. ఈ చర్యలు, బ్యాంకింగ్ వ్యవస్థలోని స్థిరత్వాన్ని పెంచడం, మరియు ఆర్థిక వ్యవస్థలోని లిక్విడిటీని సమర్థంగా నిర్వహించడం వంటి ముఖ్యమైన లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడతాయి.

# డిపాజిట్ల కంటే రుణాలే అధికం...




ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకులు సేకరిస్తున్న డిపాజిట్లు కన్నా వివిధ రంగాలకు ఇస్తున్న రుణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి బ్యాంకు అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అధికారులు తయారు చేసిన నివేదిక ప్రకారం రుణాలు రూ.11,534 కోట్ల నుంచి రూ.30,993 కోట్లకు చేరుకున్నాయి. ఈ స్థాయి వృద్ధి జాతీయ స్థాయితో పోలిస్తే అసాధారణమని చెబుతున్నారు. రాష్ట్రంలో మొత్తం బ్యాంకు డిపాజిట్ల పెరుగుదల కూడా గత ఏడాదికన్నా కనిపించింది. ఈ పెరుగుదల 7,661 కోట్ల నుంచి 13,492 కోట్లకు పెరిగినట్టు గుర్తించారు. ఇది 76.11 శాతం వృద్ధి. అయినప్పటికీ రుణాల వృద్ధితో పోలిస్తే డిపాజిట్ల సమీకరణ వెనుకబడి ఉన్నట్టు చెబుతున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇచ్చే రుణాల వాటా 39 శాతం నుంచి 41 శాతానికి పెరిగింది. స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన రుణాలు కూడా 5.44 శాతం పెరిగాయి. ఈ రంగాలకు ఇది కొంతవరకు ఉపయుక్తమేనని అధికారులు విశ్లేషిస్తున్నారు. ప్రాధాన్య రంగాలకు ఇచ్చే రుణాల వాటా కూడా 32 శాతం నుంచి 33.52 శాతానికి పెరిగింది. అంటే 1.52 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైంది. అదేవిధంగా వ్యవసాయ రుణాల వాటా 31 శాతం నుంచి 31.56 శాతానికి స్వల్పంగా పెరిగింది. ప్రధానంగా క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇది 1.51 నుంచి 2.30కి పెరిగినట్టు బ్యాంకర్లు చెబుతున్నాయి. బ్యాంకులు సమీకరిస్తున్న డిపాజిట్ల కంటే రుణాల పంపిణీ చాలా వేగంగా పెరుగుతున్నట్టు ఈ గణాంకాలు చెబుతున్నాయని వారంటున్నారు.

# జియో సేవలకు పదేళ్లు




2016 సెప్టెంబర్ 5న వాణిజ్య సేవలు ప్రారంభించిన రిలయన్స్ జియో.. పదేళ్లలో దేశీయ టెలికాం రంగాన్ని మలుపు తిప్పింది. డేటా అయిపోతుందేమోనన్న భయం నుంచి అపరిమిత డిజిటల్ లభ్యత వరకు జరిగిన పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. 2016లో 1 జీబీ డేటా ధర సుమారు రూ.228గా ఉండేది. దేశమంతటా కలిపి 4జీ వాడుతున్న వారి సంఖ్య కోటి కంటే తక్కువే. ఇంటర్నెట్ వేగం సగటున 2.5 ఎంబీపీఎస్ దాటడానికి ముప్పుతిప్పలు పడాల్సి వచ్చేది. హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను విలాసవంతమైన వస్తువుగా కాకుండా ప్రాథమిక అవసరంగా మార్చడమే ప్రధాన వ్యూహంతో జియో దూసుకెళ్లింది. ఫలితంగా.. ఈ దశాబ్ద కాలంలో 1 జీబీ డేటా ధర ఏకంగా 97 శాతం తగ్గి, ప్రస్తుతం రూ.7.9కి పడిపోయింది. దేశంలో 4జీ, 5జీ వాడే చందాదారుల సంఖ్య 93.8 కోట్లకు చేరింది. ప్రస్తుతం ఒక జియో వినియోగదారు సగటున నెలకు ఏకంగా 42.3 జీబీ డేటాను వాడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రికార్డు వృద్ధి: తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) టెలికాం సర్కిల్‌లో జియో సేవలు ప్రారంభించిన తొలి నెలలోనే 12.4 లక్షల కనెక్షన్లను సాధించింది. జూన్ 2026 నాటికి ఇవి 3.25 కోట్లకు చేరాయి. 2024 జూన్ నాటికి ఏపీ, తెలంగాణలో జియో గరిష్ఠంగా 3.30 కోట్ల చందాదారుల మైలురాయిని తాకింది. 2026 జూన్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 8.83 కోట్ల వైర్‌లెస్ కనెక్షన్లలో 36.9% వాటాతో జియో బలమైన రెండో అతిపెద్ద టెలికాం వ్యవస్థగా అవతరించింది.

# షూటింగ్ కంప్లీట్ చేసుకున్న అనన్య నాగళ్ల 'లీసా'



విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లీసా'. ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీతో జవహర్ పవార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్లను సరికొత్త పద్ధతిలో మేళవించి రూపొందిస్తున్న ఈ సినిమాకు 'ఎస్సార్ కళ్యాణమండపం' దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. అంతే కాకుండా.. ఈ సినిమాకు 'మెలోడీ బ్రహ్మ' మణిశర్మ సంగీతం అందించడం విశేషం. ఇదిలా ఉంటే.. ఇటీవలే 'లీసా' షూటింగ్ విజయవంతంగా పూర్తి కాగా.. సినిమా రిలీజ్‌పై అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'మా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చూసిన రషెస్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి, చిత్ర బృందం మొత్తం ఔట్‌పుట్ పట్ల ఎంతో నమ్మకంతో ఉంది. ఇది ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది.

సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల అద్భుతమైన నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని నవంబర్ నెలలో సినిమాను ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

## ఒకే ఒక్క సినిమా నా జీవితాన్ని మార్చేసింది..



కోలీవుడ్‌లో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ అనిష్మా అనిల్ కుమార్. 'యూత్', 'సిరాయ్' వంటి సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఈ అమ్మడు, ప్రస్తుతం దర్శకుడు అమీర్ కాంబినేషన్‌లో 'మకాలి' అనే చిత్రంలో నటిస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన అనుబంధం, ఎమోషన్స్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవల పూర్తి కాగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనిష్మా, తన చిన్ననాటి జ్ఞాపకాలను షేర్ చేసుకుంటూ తమిళ భాషపై ఉన్న ప్రేమను బయటపెట్టారు. చిన్నప్పుడు వాళ్ల అమ్మ వేరే జిల్లాలో ఉద్యోగం చేయడం వల్ల ఇంట్లో తండ్రీకూతుళ్లు ఇద్దరే ఉండేవాళ్లమని, అర్ధరాత్రి దాటిన తర్వాత రాత్రి 2 గంటల సమయంలో నాన్నతో కలిసి సినిమాలు చూసేదాన్ని అని తెలిపారు.

అలా విజయ్ నటించిన 'గిల్లి', 'అళగియ తమిళ్ మగన్' వంటి సినిమాలు చూడటం, తమిళ పాటలు వినడం వల్ల ఆ భాషపై బాగా ఆసక్తి పెరిగిందని వెల్లడించారు. అలా సినిమాలు చూస్తూ చూస్తూనే తాను ఒకటో తరగతిలోనే తమిళం చదవడం, రాయడం నేర్చుకున్నానని తెలిపారు. 'అళగియ తమిళ్ మగన్' సినిమాలో ఒక క్యారెక్టర్ తన పేరు గురు, స్వస్థలం గురువాయూర్ అని చెప్పే సీన్ ఉంటుందని గుర్తుచేశారు. దాంతో ఇన్స్పైర్ అయి తాను కూడా తన స్వస్థలం 'కట్టకడై' అని రాయడం ప్రాక్టీస్ చేశానని చెప్పారు. సినిమా తన జీవితాన్నే మార్చేసిందని.. ఒక భాషపై అమితమైన ప్రేమ కలిగిందని, దాని వల్లే తనకు తమిళం అంటే ఎంతో ఇష్టం ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడు ఆ భాష నిజంగానే తన లైఫ్‌లో ఒక పార్ట్ అయిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

## టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్న 'ప్రేమలు' బ్యూటీ



'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారి అన్ని ఇండస్ట్రీల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ తన క్యూట్ లుక్స్, యాక్టింగ్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనిట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించి సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఇలా వరుస విజయాలతో తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న మమిత, తెలుగు సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

అదీ కూడా తన మొదటి తెలుగు సినిమాలోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుందనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు.. తన తదుపరి అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మమితను హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు టాక్. ఒకవేళ ఇదే నిజమైతే మమితా బైజు కెరీర్‌కి తెలుగులో ఇది ఊహించని బిగ్ ఆఫర్ అని చెప్పవచ్చు. సూపర్ స్టార్ పక్కన నటిస్తే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా స్థిరపడటం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ క్రేజీ కాంబినేషన్ న్యూస్ విన్న మహేష్ ఫ్యాన్స్, మూవీ లవర్స్ మాత్రం ఎగ్జైట్‌మెంట్‌తో ఈ కాంబో ఓకే అయితే బాగుండు అని కోరుకుంటున్నారు.

## మాతోపాటు మీరు ఎంజాయ్ చేస్తారు.....



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ.. 'నీ పరిచయం సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ సాంగ్ షూటింగ్ చేసేప్పుడు మేము చాలా ఎంజాయ్ చేశాం. అలాగే మీరూ ఈ పాటను ఆస్వాదిస్తారని అనుకుంటున్నాను. రావులపాలెంలో ఈ పాట చిత్రీకరణ జరిగింది. అక్కడ షూటింగ్ చేసినన్ని రోజులు స్థానిక ప్రజలు ఎంతో ప్రేమను చూపించారు. బొబ్బట్లు, చేపలు తీసుకొచ్చి ఇచ్చేవారు. వాళ్ల నిస్వార్థ ప్రేమను చూశాం.

ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ.. 'నీ పరిచయం సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. అనూప్ గారు మాకు బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. ఇలాగే మీ సపోర్ట్ మా మూవీకి ఉండాలని కోరుకుంటున్నా' అని ఆనందం వ్యక్తం చేసింది.

## నవ్వులు పూయిస్తున్న "డెలులు" టీజర్...




నేటి యువతలో బాగా ట్రెండ్ అవుతున్న పాపులర్ పదం నేపథ్యంలో సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'డెలులు'. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక నిమిషం 32 సెకన్ల అధికారిక టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ఆసక్తికరంగా మొదలైన ఈ టీజర్, ఆద్యంతం హిలేరియస్ సంభాషణలతో యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువ్వేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర కొట్టిస్తా' వంటి పంచ్ డైలాగులు, పాత్రల మధ్య సాగే ఫన్నీ సన్నివేశాలు సినిమాపై ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని పెంచాయి. ప్రీతం కస్తూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్నారు.

## తెల్లకాగితం టీజర్ అప్డేట్ వచ్చేసింది.....?




'కోర్ట్', 'బ్యాండ్ మేళం' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ యాక్టర్ హర్ష్ రోషన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. యంగ్ బ్యూటీ నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్ తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చే అతిథుల లిస్ట్ సైతం రిలీజ్ చేస్తూ.. "తెల్ల కాగితం' సినిమా టీజర్ రేపు ఉదయం 9 గంటల నుండి హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరగబోతున్నది. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన మేకర్స్ తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ టీజర్ లాంచ్ కార్యక్రమంలో నిర్మాత దిల్ రాజు, రచయిత ఉ దర్శకుడు ఃమీా రవి, అలాగే దర్శకులు బాబీ, రామ్ అబ్బరాజు, భాను భోగవరపు పాల్గొననున్నారు' అని తెలిపారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించబడిన ఈ మూవీకి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు.

## మా మూవీ ఒక యూనిక్ థ్రిల్లర్.. కాన్ఫిడెంట్‌గా మీ ముందుకు రాబోతున్నాము

రాజ్ తరుణ్ హీరోగా, అమృత చౌదరి, ధన్య బాలకృష్ణ హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'టార్టాయిస్'. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ 'నీ పరిచయం..' రిలీజ్ చేశారు మేకర్స్. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. 'మా మూవీ ఒక యూనిక్ థ్రిల్లర్.

థియేటర్స్ లో మిమ్మల్ని కంప్లీట్ గా ఎంగేజ్ చేస్తుంది. ఈ చిత్రంలో మంచి మెలొడీ సందర్భం వచ్చినప్పుడు అనూప్ గారు బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. ఈ పాటను అందంగా పాడిన చిన్మయి గారికి, సాహిత్యాన్ని అందించిన చంద్రబోస్ గారికి థ్యాంక్స్.

ఈ పాటకు మా డైరెక్టర్ చాలా ఎగ్జైట్ అయ్యాడు. ఎంతో బాగా తెరకెక్కించాడు. అమృత చాలా తక్కువ టైమ్‌లో బిజీ హీరోయిన్‌గా మారిపోతుంది. అవసరాల శ్రీనివాస్, ధన్యతో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. త్వరలోనే థియేటర్స్ లోకి మా మూవీ రాబోతోంది. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందని నమ్ముతున్నా' అన్నారు. అలాగే నటి ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ.. 'ఇదే ప్లేస్‌లో పూజా కార్యక్రమాలతో మా సినిమా ప్రారంభించాం. ఈ రోజు సక్సెస్ ఫుల్‌గా మా మూవీ కంప్లీట్ చేసి కాన్ఫిడెంట్‌గా మీ ముందుకు వస్తున్నాం.




Published & Owned by Mamidi Somaiah, H.No.3-12-92/271 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor Mamidi Somaiah. Ph No. 9100933723. RNI No. TEL TEL : 2012/48343